


# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | గురువారం 22-01-2026 | సంపుటి - 26 | సంచిక -243 | రూ : 4 | పేజీలు: 8





2లో

## ఉక్కు, పర్యాటకం, ఏఐ..
# ఏపీకి పెట్టుబడుల ప్రవాహం..

- దావోస్ లో సీఎం చంద్రబాబుతో అర్సెల్లార్ మిట్టల్ ఛైర్మన్ లక్ష్మీ మిట్టల్ కీలక భేటీ
- అనకాపల్లి స్టీల్ ప్లాంట్ కు ఫిబ్రవరి 15 తర్వాత శంకుస్థాపన చేయాలని నిర్ణయం
- రాష్ట్రంలో హోటల్, పర్యాటక రంగంలో పెట్టుబడులపై తమారా లీజర్ సంస్థతో చర్చలు
- ఏఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటుకు ముందుకు రావాలని కాలిబో సంస్థకు ఆహ్వానం

## దావోస్ సదస్సు వేదికగా
# సీఎం రేవంత్ రెడ్డి కీలక ప్రతిపాదన

- ప్రపంచ ఆర్థిక సదస్సు ఫాలోఅప్ సదస్సును తెలంగాణలో నిర్వహించాలన్న ముఖ్యమంత్రి
- ప్రతి సంవత్సరం జులైలో హైదరాబాద్‌లో ఫాలోఅప్ సదస్సు నిర్వహించాలన్న సీఎం
- మద్దతు తెలిపిన ప్రముఖ వ్యాపారవేత్తలు, పాలసీ నిర్ణేతలు



2లో

## అమరావతికి చట్టబద్ధత...
### పార్లమెంట్‌లో బిల్లుకు కేంద్రం సన్నాహాలు

- పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లోనే బిల్లు ప్రవేశపెట్టే అవకాశం
- హైదరాబాద్ ఉమ్మడి రాజధాని గడువు ముగియడంతో కీలక పరిణామం
- వివిధ మంత్రిత్వ శాఖల అభిప్రాయాలను సేకరిస్తున్న హోంశాఖ
- ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టంలో సవరణకు సన్నాహాలు

2లో



## ఏపీకి రావాలంటూ
# ఫిన్‌టెక్, ఏఐ, గ్రీన్ ఎనర్జీ సంస్థలకు ఆహ్వానం

- దావోస్‌లో ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో మంత్రి లోకేశ్ బిజీబిజీ
- విశాఖలో టెక్నాలజీ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటుకు జెరోధాకు ప్రతిపాదన
- గ్రీన్ అమ్మోనియా ఉత్పత్తి కేంద్రాలపై జపాన్ సంస్థ 'జెరా'తో కీలక చర్చలు
- విశాఖలో ఏఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేయాలని స్కేల్ ఏఐకి ఆహ్వానం
- ప్రతిపాదనలను పరిశీలిస్తామని సానుకూలంగా స్పందించిన గ్లోబల్ కంపెనీలు




2లో




2లో

## మున్సిపల్ ఎన్నికలకు ముందు..
# తెలంగాణలో 47 మంది కమిషనర్ల బదిలీ

- ఎస్ఈసీ మార్గదర్శకాల మేరకు కమిషనర్లను బదిలీ చేస్తూ పురపాలక శాఖ ఉత్తర్వులు
- సొంత జిల్లాల్లో పని చేస్తున్నవారు, ఒకేచోట సుదీర్ఘకాలం పని చేస్తున్న వారు బదిలీ
- బదిలీ అయిన అధికారులు వెంటనే బాధ్యతలు స్వీకరించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్న ప్రభుత్వం

## కంటి సర్జరీలో కొత్త విప్లవం..
# స్వయంగా ఇంజెక్షన్ ఇచ్చే రోబో

- కంటి ఆపరేషన్ల కోసం స్వయంచాలిత రోబోను అభివృద్ధి చేసిన చైనా
- జంతువులపై జరిపిన ప్రయోగాల్లో 100 శాతం విజయం సాధించిన రోబో
- మనిషి కన్నా 80 శాతం ఎక్కువ కచ్చితత్వంతో సర్జరీ
- దూర ప్రాంతాల్లోనూ సంక్లిష్టమైన కంటి చికిత్సలకు మార్గం సుగమం
- వైద్యుల శిక్షణా కాలాన్ని తగ్గించడంలో ఈ రోబో ఉపయోగకరం



2లో



2లో

## రెండో రోజు..
# రూ.23 వేల కోట్లు...

- రూ.12,500 కోట్లతో రష్మి గ్రూప్ స్టీల్ కర్మాగారం
- రూ.6,000 కోట్లతో న్యూక్లర్ సంస్థ విద్యుత్ ప్లాంట్
- రూ.3,500 కోట్లతో లోరియల్ జీసీసీ
- రూ.1,000 కోట్లతో 'సర్గాడ్' విమానాల మరమ్మతు యూనిట్
- దావోస్ వేదికగా రెండో రోజు రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు
- సీఎం రేవంత్‌రెడ్డితో వివిధ కంపెనీల ఎంఓయూలు

# ఏపీకి రావాలంటూ ఫిన్‌టెక్, ఏఐ, గ్రీన్ ఎనర్జీ సంస్థలకు ఆహ్వానం

ఆంధ్రప్రదేశ్: ఆంధ్రప్రదేశ్‌కు భారీ పెట్టుబడులను ఆకర్షించడం, రాష్ట్రాన్ని టెక్నాలజీ, పునరుత్పాదక ఇంధన రంగాల్లో కీలక కేంద్రంగా మార్చడమే లక్ష్యంగా రాష్ట్ర ఐటీ, విద్య, ఆర్‌టీజీ శాఖల మంత్రి నారా లోకేశ్ స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో తన పర్యటనను వేగవంతం చేశారు. ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో భాగంగా ఆయన ఫిన్‌టెక్, గ్రీన్ ఎనర్జీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగాలకు చెందిన ప్రపంచ ప్రఖ్యాత సంస్థల అధినేతలతో వరుస సమావేశాలు నిర్వహించారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను వివరిస్తూ, స్పష్టమైన ప్రతిపాదనలతో వారిని ఏపీకి ఆహ్వానించారు.

*** విశాఖలో టెక్ హబ్.. జెరోధాకు ప్రతిపాదన**

ప్రముఖ స్టాక్ బ్రోకింగ్ సంస్థ 'జెరోధా' ఫౌండర్ నిఖిల్ కామత్‌తో మంత్రి లోకేశ్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విశాఖపట్నాన్ని ఫిన్‌టెక్ హబ్‌గా తీర్చిదిద్దే ప్రణాళికలో భాగంగా అక్కడ ఒక టెక్నాలజీ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. ప్లాట్‌ఫామ్ ఇంజనీరింగ్, బ్యాకెండ్ సిస్టమ్స్, ట్రేడింగ్ అల్గోరిథంలు, డేటా అనలిటిక్స్‌పై ఈ కేంద్రం దృష్టి సారించాలని సూచించారు. రాష్ట్రంలో స్టార్టప్ ఎకోసిస్టమ్‌ను బలోపేతం చేసేందుకు రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌తో భాగస్వామ్యం కావాలని, యువ పారిశ్రామికవేత్తలకు లీడ్ మెంటర్‌గా వ్యవహరించాలని ఆహ్వానించారు. అంతేకాకుండా, పాఠశాల స్థాయి నుంచే విద్యార్థుల్లో ఆర్థిక అక్షరాస్యతను పెంపొందించేందుకు దేశంలోనే తొలిసారిగా రాష్ట్రప్రభుత్వంతో కలిసి ఒక ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందించాలని విజ్ఞప్తి చేశారు. లోకేశ్ ప్రతిపాదనలపై స్పందించిన నిఖిల్ కామత్, వాటిని తప్పకుండా పరిశీలిస్తామని హామీ ఇచ్చారు.

*** గ్రీన్ ఎనర్జీపై జపాన్ సంస్థ 'జెరా'తో చర్చలు**

పునరుత్పాదక ఇంధన రంగంలో ప్రసిద్ధి చెందిన జపాన్ సంస్థ 'జెరా' (JERA) గ్లోబల్ సీఈవో, ఛైర్మన్ యుకియో కానితో లోకేశ్ భేటీ అయ్యారు. ఏపీలోని మూలపేట, కృష్ణపట్నం, కాకినాడ పోర్టుల మౌలిక సదుపాయాలను సద్వినియోగం చేసుకొని, సమీప ప్రాంతాల్లో గ్రీన్ అమ్మోనియా ఉత్పత్తి కేంద్రాల్లో పెట్టుబడులు పెట్టాలని కోరారు. ఇక్కడ తయారైన లోకార్బన్ అమ్మోనియాను జపాన్, ఇతర ఆసియా దేశాలకు ఎగుమతి చేసే అవకాశాలను ఆయన వివరించారు. పారిశ్రామిక అవసరాల కోసం రాయలసీమలో సౌరపవన హైబ్రిడ్ ప్రాజెక్టులను అభివృద్ధి చేయాలని, అలాగే రాష్ట్రంలోని థర్మల్ ప్లాంట్లలో ఉద్గారాలను తగ్గించేందుకు ఏపీ జెన్‌కో, ఎన్టీపీసీలతో కలిసి పైలట్ ప్రాజెక్టులు చేపట్టాలని సూచించారు. దీనిపై యుకియో కాని సానుకూలంగా స్పందిస్తూ, భారత్‌లో గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియా వాల్యూ చైన్‌లను అభివృద్ధి చేయడంపై తాము దృష్టిసారించామని, ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలను పరిశీలిస్తామని తెలిపారు.

**ఏఐ రంగంలోకి 'స్కేల్ ఏఐ'కి ఆహ్వానం**

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో అగ్రగామిగా ఉన్న 'స్కేల్ ఏఐ' గ్లోబల్ మేనేజింగ్ డైరెక్టర్ ట్రెవర్ థాంప్సన్‌తోనూ మంత్రి లోకేశ్ చర్చలు జరిపారు. సుమారు 29 బిలియన్ డాలర్ల మార్కెట్ విలువ కలిగిన ఈ సంస్థ అమెరికా రక్షణ శాఖ, మెటా, మైక్రోసాఫ్ట్, గూగుల్ వంటి దిగ్గజాలకు సేవలందిస్తోంది. ఈ నేపథ్యంలో విశాఖపట్నంలో 'స్కేల్ ఏఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'ను ఏర్పాటు చేయాలని లోకేశ్ ఆహ్వానించారు. ఆర్టీఐహెచ్ (రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్) భాగస్వామ్యంతో ఏఐ భద్రత, గవర్నెన్స్‌పై ఒక ల్యాబ్‌ను ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ ఏఐ అప్లికేషన్ల కోసం తమ ప్లాట్‌ఫామ్‌ను అందించాలని కోరారు. రాష్ట్రంలో ఏఐ అక్షరాస్యతను పెంచే కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. ఏపీ ప్రభుత్వ విజన్‌ను ప్రశంసించిన ట్రెవర్, పెట్టుబడి ప్రతిపాదనలను తమ బోర్డు దృష్టికి తీసుకెళ్లి పరిశీలిస్తామని చెప్పారు.

## గ్రీన్‌ల్యాండ్ మంచు కింద అమెరికా రహస్య స్థావరం... నాసా రాడార్‌లో గుర్తింపు

నాసా : ప్రచ్ఛన్న యుద్ధ కాలంలో అమెరికా అత్యంత రహస్యంగా నిర్మించిన సైనిక స్థావరం ఒకటి దశాబ్దాల తర్వాత మళ్లీ వెలుగులోకి వచ్చింది. గ్రీన్‌ల్యాండ్ మంచు పొరల కింద కూరుకుపోయిన 'క్యాంప్ సెంచరీ' అనే ఈ బేస్‌ను నాసా శాస్త్రవేత్తలు ఇటీవల రాడార్ స్కానింగ్‌లో అనూహ్యంగా గుర్తించారు. ఇది ఒక సాధారణ శాస్త్రీయ పరిశోధనలో భాగంగా జరిగిన ఆకస్మిక ఆవిష్కరణ కావడం విశేషం. ఈ ఏడాది ఏప్రిల్‌లో, నాసా శాస్త్రవేత్తలు గల్ఫ్‌స్ట్రీమ్ III విమానంలో ఉత్తర గ్రీన్‌ల్యాండ్‌పై ప్రయాణిస్తుండగా ఈ ఘటన జరిగింది. UAVSAR అనే అధునాతన రాడార్ వ్యవస్థను పరీక్షిస్తున్నప్పుడు, పిటుఫిక్ స్పేస్ బేస్‌కు సుమారు 200 కిలోమీటర్ల దూరంలో మంచు కింద సహజత్వానికి భిన్నంగా, సరళ రేఖల్లో ఉన్న నిర్మాణాలను రాడార్ సిగ్నల్స్ పసిగట్టాయి. చారిత్రక మ్యాపులతో సరిపోల్చగా, అది 'క్యాంప్ సెంచరీ' అని నిర్ధారించుకున్నారు. 1959లో అమెరికా ఆర్మీ ఇంజినీర్లు ఈ బేస్‌ను నిర్మించారు. 'మంచు కింద నగరం' (City Under the Ice) అని పిలిచే ఈ స్థావరం కోసం మంచులో 8 మీటర్ల లోతున సొరంగాలు తవ్వి, పైన మంచుతో కప్పేశారు. సుమారు 200 మంది సిబ్బంది నివసించేలా ల్యాబొరేటరీలు, నివాస గృహాలు నిర్మించారు. దీనికి పోర్టబుల్ న్యూక్లియర్ జనరేటర్‌తో విద్యుత్‌ను అందించేవారు. వాస్తవానికి ఇది 'ప్రాజెక్ట్ ఐస్‌వర్మ్' అనే రహస్య ప్రణాళికలో భాగం. సోవియట్ యూనియన్‌ను లక్ష్యంగా చేసుకుని అణు క్షిపణులను ఇక్కడ దాచి ఉంచాలన్నది అమెరికా వ్యూహం. అయితే, మంచు కదలికలు ఊహించిన దానికంటే వేగంగా ఉండటంతో ఈ ప్రాజెక్టు సురక్షితం కాదని భావించి, 1967 నాటికి దీన్ని పూర్తిగా వదిలేశారు. కాలక్రమేణా మంచు పేరుకుపోవడంతో, ప్రస్తుతం ఈ స్థావరం అవశేషాలు సుమారు 30 మీటర్ల (100 అడుగులు) లోతులో కూరుకుపోయి ఉన్నాయి. అణు రియాక్టర్‌ను తొలగించినప్పటికీ, రసాయనిక, జీవ, రేడియోధార్మిక వ్యర్థాలు అక్కడే మిగిలిపోయాయి. వాతావరణ మార్పులతో మంచు కరుగుతున్న నేపథ్యంలో, భవిష్యత్తులో ఈ వ్యర్థాలు బయటపడి పర్యావరణానికి ముప్పుగా మారవచ్చని శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## కంటి సర్జరీలో కొత్త విప్లవం... స్వయంగా ఇంజెక్షన్ ఇచ్చే రోబో

ఢిల్లీ : వైద్య సాంకేతిక రంగంలో చైనా పరిశోధకులు ఒక అద్భుతమైన ముందడుగు వేశారు. కంటిలోని అత్యంత సున్నితమైన భాగాల్లోకి స్వయంచాలకంగా (అటానమస్) ఇంజెక్షన్లు ఇచ్చే ఒక రోబోటిక్ వ్యవస్థను విజయవంతంగా అభివృద్ధి చేశారు. చైనీస్ అకాడమీ ఆఫ్ సైన్సెస్‌కు చెందిన ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆటోమేషన్ ఈ రోబోను రూపొందించింది. రెటీనా సంబంధిత వ్యాధులకు చికిత్స అందించే సర్జరీలలో కచ్చితత్వం, భద్రతను ఈ రోబో గణనీయంగా పెంచుతుందని భావిస్తున్నారు. జిన్హువా న్యూస్ ఏజెన్సీ కథనం ప్రకారం జంతువులపై జరిపిన ప్రయోగాల్లో ఈ రోబో 100 శాతం విజయవంతంగా సబ్‌రెటినల్, ఇంట్రావాస్కులర్ ఇంజెక్షన్లు ఇచ్చింది. ఈ వివరాలను పరిశోధకులు "సైన్స్ రోబోటిక్స్" జర్నల్‌లో ప్రచురించారు. కంటిలోని నిర్మాణాలు చాలా చిన్నవిగా, మృదువుగా ఉండటంతో రెటీనా సర్జరీలు అత్యంత సవాలుతో కూడుకున్నవి. ఈ కొత్త రోబోటిక్ వ్యవస్థ 3D స్పేషియల్ పర్సెప్షన్, ప్రిసైజ్ పొజిషనింగ్ వంటి అధునాతన అల్గారిథమ్‌లతో పనిచేస్తుంది. ప్రయోగాల్లో, మనుషులు చేసే సర్జరీలతో పోలిస్తే ఈ రోబో పొరపాట్లను దాదాపు 80 శాతం తగ్గించింది. సర్జన్ నియంత్రించే రోబోటిక్ సర్జరీతో పోలిస్తే 55 శాతం తక్కువ తప్పులు చేసినట్లు బృందం వెల్లడించింది. "ఈ ఫలితాలు స్వయంచాలిత కంటి సర్జరీ రోబో ఆచరణ సాధ్యమేనని, ఇంజెక్షన్ల కచ్చితత్వం, భద్రత, స్థిరత్వాన్ని ఇది మెరుగుపరుస్తుందని నిరూపిస్తున్నాయి. ఈ వ్యవస్థ సర్జరీల స్థిరత్వాన్ని పెంచుతుంది. సర్జన్ల శిక్షణా కాలాన్ని కూడా తగ్గిస్తుంది" అని పరిశోధకులు తెలిపారు. ఈ ఆవిష్కరణతో నిపుణులైన సర్జన్లు అందుబాటులో లేని మారుమూల ప్రాంతాల్లో కూడా క్లిష్టమైన కంటి ఆపరేషన్లు చేసే అవకాశం ఏర్పడుతుంది. గతేడాది నవంబర్‌లో చైనా 5G టెక్నాలజీతో రిమోట్ రోబోటిక్ కంటి సర్జరీ చేసింది, అయితే అది సర్జన్ నియంత్రణలో జరగ్గా, తాజా ఆవిష్కరణ స్వయంగా పనిచేయడం విశేషం.

## మున్సిపల్ ఎన్నికలకు ముందు...
# తెలంగాణలో 47 మంది కమిషనర్ల బదిలీ

హైదరాబాద్: 2026 మున్సిపల్ ఎన్నికలకు ముందు తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా 47 మంది మున్సిపల్ కమిషనర్లను బదిలీ చేసింది. నిష్పాక్షికంగా ఎన్నికల నిర్వహించేందుకు జీహెచ్ఎంసీ, కార్పొరేషన్లు, మున్సిపాలిటీలలో ఈ బదిలీలు చేపట్టింది. ఈ మేరకు పురపాలక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. త్వరలో రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఎస్ఈసీ మార్గదర్శకాల మేరకు కమిషనర్లను బదిలీ చేస్తూ పురపాలక శాఖ ఉత్తర్వులు ఇచ్చింది. సొంత జిల్లాల్లో పనిచేస్తున్న వారు, ఒకేచోట సుదీర్ఘ కాలం పనిచేస్తున్న అధికారులను పరిపాలనాపరమైన కారణాలతో పాటు పదోన్నతులపై బదిలీ చేసింది. సి.వి.ఎన్. రాజు ఆదిలాబాద్ మున్సిపల్ కమిషనర్ (గ్రేడ్ 3) నుంచి రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ సెక్రటరీగా బదిలీ అయ్యారు. జి.రాజు క్యాతనపల్లి నుంచి ఆదిలాబాద్ మున్సిపాల్ కమిషనర్‌గా, ముసాబ్ అహ్మద్ నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ నుంచి హుజూరాబాద్ మున్సిపల్ కమిషనర్‌గా, బి.శ్రీనివాస్ ఆలేరు నుంచి హుజూర్ నగర్ మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ అయ్యారు. బి.శరత్ చంద్ర ప్రమోషన్‌పై నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా వెళ్లనున్నారు. బదిలీ అయిన అధికారులు వెంటనే తమకు కేటాయించిన కొత్త ప్రాంతాల్లో బాధ్యతలు స్వీకరించాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది.

## దావోస్ సదస్సు వేదికగా
## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక ప్రతిపాదన

దావోస్ : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక కీలక ప్రతిపాదన చేశారు. ప్రపంచ ఆర్థిక సదస్సు ఫాలోఅప్ సదస్సును ప్రతి సంవత్సరం తెలంగాణలో నిర్వహించాలని ఆయన సూచించారు. దావోస్‌లో జరుగుతున్న సదస్సులో ఆయన ఈ అంశాన్ని ప్రస్తావించారు. ప్రతి సంవత్సరం జులైలో హైదరాబాద్ నగరంలో ఫాలోఅప్ సదస్సు నిర్వహించాలని ఆయన కోరారు. ముఖ్యమంత్రి ప్రతిపాదనకు ప్రముఖ వ్యాపారవేత్తలు, పాలసీ నిర్ణేతలు మద్దతు తెలిపారు. ఇదిలా ఉండగా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో బ్లైజ్ కో ఫౌండర్ సీఈవో దినకర్ మునగాల సమావేశమయ్యారు. హైదరాబాద్‌లో బ్లైజ్ ఆర్ అండ్ డీ సెంటర్ విస్తరణకు తెలంగాణ ప్రభుత్వంతో ఆయన ఎంవోయూ కుదుర్చుకున్నారు. దావోస్ ప్రపంచ ఆర్థిక సదస్సులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ లైఫ్ సైన్సెస్ పాలసీని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.



## ఉక్కు, పర్యాటకం, ఏఐ.. ఏపీకి పెట్టుబడుల ప్రవాహం..

అమరావతి: ప్రపంచ ఆర్థిక సదస్సు వేదికగా ఆంధ్రప్రదేశ్ కు పెట్టుబడులను ఆకర్షించడంలో ముఖ్యమంత్రి చంద్రబాబు తలమునకలై ఉన్నారు. దావోస్ పర్యటన మూడో రోజున ఆయన ప్రపంచ ప్రఖ్యాత పారిశ్రామిక దిగ్గజాలతో వరుస సమావేశాలు నిర్వహించారు. రాష్ట్రానికి భారీ పరిశ్రమలను తీసుకురావడమే లక్ష్యంగా జరిపిన ఈ చర్చలు ఫలవంతమయ్యాయి. ముఖ్యంగా ఉక్కు, పర్యాటకం, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వంటి కీలక రంగాల్లో పెట్టుబడులకు మార్గం సుగమం అయింది.

*** అనకాపల్లి స్టీల్ ప్లాంట్ కు ముహూర్తం ఖరారు**

దావోస్ లోని ఏపీ లాంజ్ లో ముఖ్యమంత్రి చంద్రబాబుతో అర్సెల్లార్ మిట్టల్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ లక్ష్మీ మిట్టల్, సీఈవో ఆదిత్య మిట్టల్ సమావేశమయ్యారు. ఈ కీలక భేటీలో మంత్రులు నారా లోకేష్, టీజీ భరత్ కూడా పాల్గొన్నారు. అనకాపల్లి జిల్లాలో అర్సెల్లార్ మిట్టల్ నిప్పన్ స్టీల్ సంస్థ నిర్మించ తలపెట్టిన భారీ ఉక్కు కర్మాగారం పురోగతిపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చించారు. తొలి దశలోనే దాదాపు రూ. 60 వేల కోట్ల భారీ పెట్టుబడితో ఈ ప్లాంట్ ను ఏర్పాటు చేస్తున్నారు. పరిశ్రమ ఏర్పాటుకు సంబంధించి వివిధ దశల్లో ఉన్న అనుమతులు, భూసేకరణ వంటి అంశాలపై లక్ష్మీ మిట్టల్ సమక్షంలోనే సీఎం చంద్రబాబు అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఫిబ్రవరి 15వ తేదీలోగా అన్ని అనుమతులు పూర్తి చేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అనంతరం స్టీల్ ప్లాంట్ కు శంకుస్థాపన చేయాలని నిర్ణయించారు.

ప్రభుత్వ పరంగా ఎలాంటి జాప్యం ఉండదని, అవసరమైతే ఢిల్లీ వెళ్లి కేంద్రం నుంచి అనుమతులు సాధించాలని మంత్రులకు సీఎం సూచించారు. ప్లాంట్ పురోగతిని మంత్రి లోకేశ్ నిరంతరం పర్యవేక్షిస్తున్నారని ఆదిత్య మిట్టల్ ఈ సందర్భంగా ప్రశంసించారు.

**ఏపీలో పర్యాటకానికి పెద్దపీట**

ప్రముఖ హాస్పిటాలిటీ సంస్థ 'తమారా లీజర్' సీఈవో సృష్టి శిబులాల్ తో ముఖ్యమంత్రి చంద్రబాబు సమావేశమై రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను వివరించారు. పర్యాటక రంగ ప్రాజెక్టులకు పారిశ్రామిక హోదా కల్పించామని, పెట్టుబడులకు ఏపీ ఇప్పుడు పూర్తిగా సిద్ధంగా ఉందని ("ఏపీ ఈజ్ అన్ లాక్") తెలిపారు. పోలవరం నుంచి భద్రాచలం వరకు గోదావరి తీరంలోనూ, కోనసీమ, గండికోట, అరకు, లంబసింగి వంటి ప్రాంతాల్లోనూ అద్భుతమైన టూరిజం కేంద్రాలను అభివృద్ధి చేయవచ్చని సూచించారు. రాష్ట్రంలోని ప్రతీ పర్యాటక ప్రాంతానికి రోడ్లు, విమానాశ్రయాల కనెక్టివిటీ ఉందని, హోటల్ రంగానికి తమ ప్రభుత్వం అన్ని విధాలా ప్రోత్సాహం అందిస్తుందని హామీ ఇచ్చారు. పర్యాటకం ద్వారా స్థానిక ఆర్థిక వ్యవస్థ బలపడటంతో పాటు, ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయని సీఎం వివరించారు.

*** ఎకో-టూరిజం, హోమ్ స్టే లపై తమారా ఆసక్తి**

ముఖ్యమంత్రి ప్రతిపాదనలపై తమారా లీజర్ సంస్థ సానుకూలంగా స్పందించింది. ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో పర్యావరణ హితమైన 'ఎకోటూరిజం' పార్కులు ఏర్పాటు చేసేందుకు ఆసక్తిగా ఉన్నామని సంస్థ ప్రతినిధులు తెలిపారు. విశాఖపట్నం సహా ఇతర ప్రాంతాల్లో 'హోమ్ స్టే' ప్రాజెక్టులు చేపట్టేందుకు కూడా సిద్ధంగా ఉన్నట్టు వెల్లడించారు. 'కమ్యూనిటీ ఫస్ట్' అనే నినాదంతో గిరిజన యువతకు నైపుణ్య శిక్షణ ఇచ్చి, వారిని కూడా ఈ ప్రాజెక్టులలో భాగస్వాములను చేస్తామని సీఎంకు వివరించారు. సరైన ప్రతిపాదనలతో వస్తే పూర్తి సహకారం అందిస్తామని చంద్రబాబు స్పష్టం చేశారు.

## అమరావతికి చట్టబద్ధత...
## పార్లమెంట్‌లో బిల్లుకు కేంద్రం సన్నాహాలు

ఆంధ్రప్రదేశ్: ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతికి పూర్తిస్థాయి చట్టబద్ధత కల్పించే ప్రక్రియను కేంద్ర ప్రభుత్వం వేగవంతం చేసింది. ఇందుకు సంబంధించిన బిల్లును రాబోయే పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లోనే ప్రవేశపెట్టేందుకు కసరత్తు చేస్తున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఈ చర్యతో రాజధానిపై ఉన్న అనిశ్చితికి తెరపడనుంది. 2014లో రాష్ట్ర విభజన తర్వాత పదేళ్ల పాటు హైదరాబాద్ ఉమ్మడి రాజధానిగా కొనసాగింది. 2024 జూన్ 2తో ఆ గడువు ముగియడంతో, ఏపీకి స్వతంత్ర రాజధానిని అధికారికంగా ప్రకటించాల్సిన అవసరం ఏర్పడింది. ఈ నేపథ్యంలో, అమరావతిని రాజధానిగా ఖరారు చేయాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇటీవల కేంద్రానికి ఒక నివేదిక పంపింది. రాజధాని ఎంపిక ప్రక్రియ, చేపట్టిన నిర్మాణాల వివరాలతో కూడిన నోట్‌ను సమర్పించింది. ఈ నివేదికను పరిశీలించిన కేంద్ర హోంశాఖ, దీనిపై తదుపరి చర్యలు ప్రారంభించింది. రాజధాని ఎప్పటి నుంచి అమల్లోకి రావాలో స్పష్టం చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరగా, 2024 జూన్ 2 నుంచే వర్తింపజేయాలని రాష్ట్రం విజ్ఞప్తి చేసింది. ఈ ప్రతిపాదనపై పట్టణాభివృద్ధి, న్యాయ, వ్యవసాయ శాఖలతో పాటు నీతి ఆయోగ్ అభిప్రాయాలను కూడా కేంద్ర హోంశాఖ సేకరిస్తోంది. అన్ని శాఖల నుంచి అభిప్రాయాలు అందిన తర్వాత ఈ ప్రతిపాదనను కేంద్ర క్యాబినెట్ ఆమోదానికి పంపనున్నారు. క్యాబినెట్ ఆమోదం లభించగానే, పార్లమెంట్ సమావేశాల్లో ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టంలో సవరణ కోసం బిల్లును ప్రవేశపెడతారు. ఈ చట్టసవరణతో అమరావతికి రాజధానిగా శాశ్వత భద్రత, చట్టపరమైన గుర్తింపు లభిస్తుంది. తద్వారా భూములిచ్చిన రైతులకు, పెట్టుబడిదారులకు భరోసా కలుగుతుందని, రాజధాని నిర్మాణ పనులు వేగవంతమవుతాయని అధికారులు భావిస్తున్నారు.

# రెండో రోజు రూ.23 వేల కోట్లు...

హైదరాబాద్: దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో పాల్గొంటున్న 'తెలంగాణ రైజింగ్ బృందం' రెండోరోజు బుధవారం భారీగా పెట్టుబడులను ఆకర్షించింది. రాష్ట్రంలో రూ.23 వేల కోట్ల పెట్టుబడులను పెట్టేందుకు పలు సంస్థలు ప్రభుత్వంతో అవగాహన ఒప్పందాలు (ఎంఓయూ) కుదుర్చుకున్నాయి. డక్టైల్ ఐరన్ (డీఐ) పైపుల తయారీలో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన రష్మి గ్రూప్... తెలంగాణలో రూ.12,500 కోట్ల పెట్టుబడితో స్టీల్ ఉత్పత్తి యూనిట్ ఏర్పాటుకు ముందుకొచ్చింది. రూ.6 వేల కోట్ల పెట్టుబడితో స్మాల్ మాడ్యులర్ రియాక్టర్ (ఎస్ఎంఆర్) ఆధారిత విద్యుత్ ప్రాజెక్ట్ అభివృద్ధికి స్లోవాకియా దేశానికి చెందిన 'న్యూక్లర్ ప్రొడక్ట్స్' సంస్థ సంసిద్ధత వ్యక్తంచేసింది. సౌందర్యరంగంలో ప్రపంచ అగ్రగామి సంస్థ లోరియల్... హైదరాబాద్‌లో రూ.3,500 కోట్లతో తమ మొదటి గ్లోబల్ టెక్ హబ్‌ను నవంబరులో ప్రారంభించనున్నట్లు వెల్లడించింది. విమానయాన రంగంలో పేరొందిన అమెరికాకు చెందిన 'సర్గాడ్' సంస్థ... తెలంగాణలో 'మెయింటెనెన్స్ అండ్ రిపేర్ యూనిట్' నెలకొల్పనుంది. రానున్న 35 సంవత్సరాల్లో దశలవారీగా రూ.1,000 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు తెలంగాణ ప్రభుత్వంతో ఎంవోయూ కుదుర్చుకుంది. ఈ నెల 23 వరకు కొనసాగనున్న ఈ సదస్సులో మరిన్ని సంస్థలతో తెలంగాణ బృందం చర్చలు జరపనుంది.

*** స్టీల్ ప్లాంట్‌తో 12 వేల మందికి ఉద్యోగాలు**

తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం బుధవారం దావోస్‌లో రష్మి గ్రూప్‌తో స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు ఎంవోయూ కుదుర్చుకుంది. ఈ ప్రాజెక్ట్ ద్వారా రాష్ట్రంలో 12 వేల మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగాలు వచ్చే అవకాశముంది. రష్మి గ్రూప్ ప్రమోటర్ సజ్జన్ కుమార్ పట్వారి, డైరెక్టర్ సంజిబ్ కుమార్ పట్వారిలు తెలంగాణ రైజింగ్ బృందంతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. "తెలంగాణ విభిన్న పరిశ్రమలతో బలమైన పారిశ్రామిక వ్యవస్థగా ఎదుగుతోంది. ముఖ్యంగా తయారీ రంగానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు అవసరమైన అన్ని సహాయ, సహకారాలను, బొగ్గు సరఫరా లింకేజీలు అందిస్తాం" అని మంత్రి హామీ ఇచ్చారు. రూ.12,500 కోట్లతో ఏర్పాటు చేయనున్న స్టీల్ ప్లాంట్ లేబర్ ఇంటెన్సివ్ తయారీ విధానంతో పనిచేస్తుందని, పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు కల్పిస్తుందని డైరెక్టర్ సంజిబ్ కుమార్ తెలిపారు.

# ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

* **కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్**



కుత్బుల్లాపూర్, ప్రజాస్ఫూర్తి : ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ అన్నారు అనారోగ్యంతో బాధపడుతూ నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కావలి సంజీవ కు మంజూరైన రూ. 2.50 లక్షల ఎల్ వో సి ని బుధవారం ఆయన నివాసంలో బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు రోజుల క్రితం *తనను కలిసి వైద్యాపరీక్షల నిమిత్తము ప్రభుత్వం తరుపున ఆర్థిక సహాయం చెయ్యాలని కోరారని తెలిపారు. దీంతో మాజీ ఎమ్మెల్యే వెంటనే స్పందించి *ఇంచార్జ్ మంత్రివర్యులు దుద్దిళ్ళ శ్రీధర్ బాబు దృష్టికి తీసుకెళ్ళి 2.50 వేల ఎల్ఓసి మంజూరు చేపించడం జరిగిందన్నారు. అనారోగ్య పరిస్థితులతో ఆసుపత్రిలలో చికిత్స పొందినవారు, చికిత్స నిమిత్తము వైద్య సేవలకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తుంది కావున ప్రజలు సద్వినియోగపర్చుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కొంపల్లి మాజీ సర్పంచ్ జిమ్మీ దేవేందర్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ జయరాం, నిజాంపేట్ మాజీ కార్పొరేటర్ ఏనుగుల శ్రీనివాసరెడ్డి, కూన రాఘవేంద్ర గౌడ్, చౌడ శ్రీనివాస్, మోటే శ్రీనివాస్ యాదవ్, నాగిళ్ల శ్రీనివాస్, రమేష్ మంజూల్కర్, నర్సింగరావు, కృష్ణ యాదవ్, జిమ్ వేణు, దుగ్యాల ప్రసాద్, ఉలిపిశ్యాం, గుమస్తా మధుసూదన్, తదితరులు పాల్గొన్నారు.

# రెక్కాడితే గానీ డొక్కాడని పేద కుటుంబానికి అండగా నిలిచిన ఇ ఎల్ వి భాస్కర్ ఫౌండేషన్

* **రోడ్డు ప్రమాదంలో కాలు కోల్పోయిన యువకుడికి అండగా**
* **కృత్రిమ కాలు అమర్చి మానవత్వాన్ని చాటుకున్న ఇ ఎల్ వి భాస్కర్ ఫౌండేషన్**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: రోడ్డు ప్రమాదంలో నడవడికను దూరం చేసింది. అసలే రెక్కాడితే గాని డొక్కాడని నిరుపేద కుటుంబం.. నేనున్నానంటూ ముందుకు వచ్చిన ఇ ఎల్ వి భాస్కర్ ఫౌండేషన్ ఆ యువకుడికి మళ్ళీ నడిచే ధైర్యాన్ని ఇచ్చింది. మునుగోడు మండలం కలవలపల్లికి చెందిన వంటేపాక గణేష్ వాటర్ ప్యూరిఫైయర్ టెక్నీషియన్ గా పని చేస్తూ, ముంబైలో కూలి పని చేసే తండ్రి దశరథకు చేదోడు వాదోడుగా ఉంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. నాలుగు నెలల క్రితం దేవరకొండలో పని ముగించుకుని తిరిగి వస్తుండగా, నల్గొండ సమీపంలో కారు ఢీకొట్టింది. ఆ ప్రమాదంలో గణేష్ కుడి కాలు కోల్పోయాడు. కాలు లేకపోతే పనికి వెళ్ళలేను.. పని చేయకపోతే ఇల్లు గడవదు అని కుమిలిపోతున్న గణేష్ గురించి తెలుసుకున్న ఇ ఎల్ వి భాస్కర్ ఫౌండేషన్ చైర్మన్ ఇరుగదిండ్ల భాస్కర్ అభయహస్తం అందించారు. అతనికి కృత్రిమ కాలును ఉచితంగా అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా ఇ ఎల్ వి భాస్కర్ ఫౌండేషన్ చైర్మన్ భాస్కర్ మాట్లాడుతూ భవిష్యత్తులో గణేష్ కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామన్నారు. పేదరికంతో ఏ ఒక్కరూ విద్య ,వైద్యానికి, ఉపాధికి దూరం కాకూడదన్నదే తమ ఫౌండేషన్ లక్ష్యమని పేర్కొన్నారు.

# మాదక ద్రవ్యాల నియంత్రణ, రహదారుల భద్రతపై పటిష్ట చర్యలు చేపట్టాలి

* **జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్**




ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: జిల్లాలో మాదక ద్రవ్యాల నియంత్రణ, రహదారుల భద్రతపై పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అధికారులను ఆదేశించారు. ఐడీఓసీలో జరిగిన జిల్లా స్థాయి నార్కోటిక్ కంట్రోల్ కమిటీ సమావేశంలో గంజాయి సాగు, అక్రమ రవాణా, డ్రగ్స్ వినియోగంపై కఠిన నిఘా, అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. విద్యాసంస్థల్లో డ్రగ్స్ దుష్ప్రభావాలపై అవగాహన, వినియోగదారులకు కౌన్సిలింగ్, అవసరమైతే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అనంతరం జరిగిన రహదారుల భద్రత కమిటీ సమావేశంలో డ్రంక్ అండ్ డ్రైవ్, ఓవర్ స్పీడ్, హెల్మెట్ ధరించకపోవడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని, వాటి నియంత్రణకు కఠిన చర్యలు చేపట్టాలని తెలిపారు. బ్లాక్ స్పాట్లలో భద్రతా చర్యలు బలోపేతం చేయాలని, పాఠశాలల్లో రోడ్ సేఫ్టీ అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. ప్రమాద బాధితులను రక్షించిన గుడ్ సమరిటన్‌లకు రూ.25 వేల ప్రోత్సాహకం అందిస్తామని తెలిపారు.

# ప్రతి ఇంటికి త్రాగునీరు అందించడమే లక్ష్యం

* **ఫిబ్రవరి 1 నుంచి 20 రోజుల పాటు 'జల్ శక్తి అంకల్' ప్రత్యేక కార్యాచరణ**
* **జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్**



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం:జిల్లాలో ప్రతి ఇంటికి నాణ్యమైన త్రాగునీరు అందించడమే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల జల్ జీవన్ మిషన్‌లో భాగంగా ఫిబ్రవరి 1 నుంచి 20 రోజుల పాటు 'జల్ శక్తి అంకల్' ప్రత్యేక కార్యక్రమాన్ని అమలు చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ తెలిపారు.బుధవారం ఐడీఓసీ కలెక్టర్ ఛాంబర్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి త్రాగునీటి సరఫరా పర్యవేక్షణ కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామం నుంచి మండల స్థాయి వరకు ప్రత్యేక కమిటీల ఏర్పాటు చేసి త్రాగునీటి లోపాలను గుర్తించి తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు.అంగన్వాడీలు, ప్రభుత్వ పాఠశాలల్లో నీటి సరఫరా పరిస్థితిని పరిశీలించి నివేదికలు సమర్పించాలని, నీటి ఎద్దడి ప్రాంతాలను గుర్తించి అవసరమైన చోట కొత్త ట్యాంకులు, మరమ్మత్తులు చేపట్టాలని సూచించారు. పైపులైన్ లీకేజీలను వెంటనే సరిచేసి, వేసవిలో నీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు కార్యాచరణ చేపట్టాలని కలెక్టర్ స్పష్టం చేశారు.




# యంత్రాలతో వ్యవసాయం సులభతరం

* **సబ్సిడీపై రైతులకు వ్యవసాయ పనిముట్ల పంపిణీ**
* **చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య**





చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: వ్యవసాయ యంత్రాలను ఉపయోగించి వ్యవసాయం చేయడం సులభతరం అవుతుందని చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో రాష్ట్రీయ కృషి వికాస్ యోజన పథకం కింద 50శాతం రాయితీపై చౌటుప్పల్, సంస్థాన్ నారాయణపురం మండలాల రైతులకు మంజూరైన యంత్ర పరికరాల పంపిణీ కార్యక్రమాన్ని చౌటుప్పల్ మండలం గుడిమల్కాపురం శివారులోని శ్రీ బాలాజీ ఫంక్షన్ హాల్ లో బుధవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ ఉబ్బు వెంకటయ్య హాజరయ్యారు. చౌటుప్పల్ రైతులకు రూ.8.5లక్షల సంస్థాన్ నారాయణపురం రైతులకు రూ.4.5లక్షల రాయితీ కి సంబంధించిన వివిధ పనిముట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఉబ్బు వెంకటయ్య మాట్లాడుతూ ప్రభుత్వం అందించే పథకాలు సద్వినియోగం చేసుకోవాలని రైతులకు సూచించారు. గతంలో యంత్ర పరికరాలు లేక మనుషుల ద్వారా వ్యవసాయం చేయటం ద్వారా ఎక్కువ పనిభారం పడేదని, ఈ యంత్ర పరికరాల వలన పనిభారం తగ్గుతుందన్నారు. వైస్ చైర్మన్ శ్రీ ఆకుల ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ పనిముట్లతో ఆధునిక వ్యవసాయం చేసి ఖర్చు తగ్గించుకొని అధిక దిగుబడులు పొందవచ్చన్నారు. కావున రైతులు ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీ పథకాలను ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సహాయ వ్యవసాయ సంచాలకులు భువనగిరి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గతంలో పంట అవశేషాలను వరి పత్తి కంది మొదలగు పంటల అవశేషాలను తగలబెట్టేవారని, ఈ విధంగా తగలబెట్టడం వల్ల భూసారం తగ్గుతుందన్నారు. కావున ఈ ఆధునిక యంత్ర పరికరాలైన (రోటవేటర్, మల్టి క్రాప్ షెడ్డర్)ఉపయోగించి భూమిలో కలియ దున్నటం వలన సేంద్రియ కర్బనం పెరిగి అధిక దిగుబడులు పొందవచ్చన్నారు. చౌటుప్పల్ మండల వ్యవసాయ అధికారి ముత్యాల నాగరాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో చౌటుప్పల్, సంస్థాన్ నారాయణపురం మండలాల సర్పంచులు జువ్వి నర్సింహ్మా, సాతిరి శ్రీధర్, ముత్యాల అంజయ్య, ఉప్పల రమేష్, తోటకూర శంకర్, ఉప సర్పంచ్ లు, వ్యవసాయ మార్కెట్ కమిటి డైరెక్టర్లు, యంత్ర పరికరాల లబ్ధి దారులు, రైతులు, డీలర్లు వ్యవసాయ విస్తరణ అధికారులు తదితరులు పాల్గొన్నారు.




# ట్రాఫిక్ నిబంధనలు మన నుండే మొదలు పెట్టాలి

* **ప్రజలకు ఆదర్శంగా ఉండేందుకు కృషి చేద్దాం**
* **నిబంధనలు తెలియచేసిందుకు మీడియా కృషి చేయాలి**
* **అరైవ్ అలైవ్ కార్యక్రమంలో మేడిపల్లి సీఐ ఆర్ గోవింద్ రెడ్డి**

మేడిపల్లి ప్రజాస్ఫూర్తి: మన ప్రాణాలను కాపాడుకోవడానికి ట్రాఫిక్ నిబంధనలు పాటించడం మన నుండే మొదలు పెట్టాలని అప్పుడే మనం ఇతరులకు ఆదర్శంగా నిలుస్తామని మేడిపల్లి సీఐ ఆర్ గోవింద్ రెడ్డి అన్నారు. బుధవారం మేడిపల్లి పోలీసు స్టేషను లో ట్రాఫిక్ నిబంధనలపై నిర్వహిస్తున్న "అలైవ్ అరైవ్" కార్యక్రమం 6 వ రోజు మీడియా పోలీసుల పాత్ర పై నిర్వహించిన సమావేశంలో సీఐ గోవింద్ రెడ్డి మాట్లాడుతూ నేడు ట్రాఫిక్ నిబంధనలు పాటించని కారణంగా అనేక కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని అన్నారు.వాహనాలు నడిపే సమయంలో వాడే హెల్మెట్, సీటు బెల్ట్ వలన అనేక ఉపయోగాలు ఉన్నాయని సూచించారు.సమాజాన్ని చైతన్య పరచడంలో మీడియా పాత్ర చాల కీలకమైనదని అందుకే మొదట ట్రాఫిక్ నిబంధనలు పాటించే అంశంలో మనం అందరికీ ఆదర్శంగా నిలిచేలా మన ప్రవర్తన ఉండాలని దానికి మీడియా మిత్రులు ఖచ్చితంగా ట్రాఫిక్ రూల్స్ పాటించేందుకు ఈ రోజు నుండే బాధ్యత తీసుకోవాలని అన్నార.ఈ కార్యక్రమం మేడిపల్లి ఎస్ఐలు కె.కిష్టయ్య, ఉదయ్ భాస్కర్, శివకుమార్, తిరుపతయ్య,మీడియా ప్రతినిధులు మేడిపల్లి మండల ప్రెస్ క్లబ్ మాజీ అధ్యక్షుడు కల్కూరి ఎల్లయ్య, అధ్యక్షుడు చిర్ర శ్రీధర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి వి.సుందర్,కోశాధికారి మరాటి మల్లేష్, మాజీ కోశాధికారి రాములు యాదవ్, ఉపాధ్యక్షుడు చింత రమేష్, సహాయకార్యదర్శి చిన్నం మధు,సభ్యులు జంగా నరేందర్, జె.భగీరథ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఈఎంఆర్ఐ 102, 1962 ప్రాజెక్టుల్లో డ్రైవర్ ఉద్యోగాలు

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఈఎంఆర్ఐ 102, 1962 ప్రాజెక్టులలో డ్రైవర్ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ నెల 22, 23, 24, 25 తేదీల్లో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.ఈ ఉద్యోగాలకు ఆసక్తి గల అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు ఒక జిరాక్స్ సెట్ తీసుకొని ఇంటర్వ్యూకు హాజరుకావాల్సి ఉంటుందని తెలిపారు.కనీస ఎత్తు 5.5 అడుగులు, లైట్ డ్రైవింగ్ లైసెన్స్, బ్యాడ్జి నంబర్, 10వ తరగతి ఉత్తీర్ణత, ఆధార్, పాన్ కార్డు తప్పనిసరి, 35 సంవత్సరాల లోపు అర్హత కలిగి ఉండాలన్నారు. . డ్రైవింగ్ టెస్ట్, సర్టిఫికెట్ వెరిఫికేషన్ ద్వారా ఎంపిక చేస్తారని తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పరిధిలో పని చేయాలని, ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఇంటర్వ్యూ లు కొత్తగూడెం, రామవరంలోని మాత శిశు ప్రభుత్వ ఆసుపత్రి కార్యాలయంలో 108, 102 లలో ఉంటాయని తెలిపారు. పూర్తి వివరాలకు 9494571050 నంబర్‌ను సంప్రదించాలని అధికారులు సూచించారు.

# ప్రతిభా పురస్కారం అందుకున్న కవి సయ్యద్ అబ్దుల్ నజీర్




ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలోని రామవరం ప్రాంతానికి చెందిన అభ్యుదయ కవి సయ్యద్ అబ్దుల్ నజీర్‌కు శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో జాతీయ సాహిత్య ప్రతిభా పురస్కారం లభించింది. సాహిత్య రంగంలో ఆయన చేసిన విశిష్ట సేవలు, సామాజిక చైతన్యాన్ని ప్రతిబింబించే రచనలను గుర్తించి ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. బుధవారం విజయవాడలో నిర్వహించిన కార్యక్రమంలో నజీర్‌కు శ్రీశ్రీ కళావేదిక ప్రతినిధుల చేతులమీదుగా ప్రతిభా పురస్కారాన్ని అందించారు. ఈ సందర్భంగా జిల్లా కవులు, సాహితీవేత్తలు, కళాకారులు, స్థానిక ప్రముఖులు ఆయనను అభినందించారు. ఇప్పటికే నజీర్ పలు ప్రతిష్ఠాత్మక సాహిత్య పురస్కారాలను అందుకుని గుర్తింపు పొందారు.

# విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ ప్రారంభం

* **చౌటుప్పల్ మార్కెట్ కమిటి చైర్మన్ ఉబ్బు వెంకటయ్య**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ మున్సిపాలిటీ కేంద్రం 12వ వార్డులో నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ ను చౌటుప్పల్ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉబ్బు వెంకటయ్య మాట్లాడుతూ నూతన ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటుతో 12వ వార్డులో ఎలాంటి అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్ అందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు సుర్వి నరసింహ గౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ పబ్బు శ్రీకాంత్ గౌడ్, నాయకులు బొంగు జంగయ్య గౌడ్, పాక చిరంజీవి, బొబ్బిళ్ళ మురళి, చింతల సాయిలు, మార్గం నరసింహ, చెవగోని వెంకటేష్ గౌడ్, వర్కాల కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా యువజన కాంగ్రెస్ నాయకుడు అరవింద్ జన్మదిన వేడుకలు

- **కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపిన మంత్రి**



అందోలు, ప్రజాస్ఫూర్తి: రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి సీ.దామోదర రాజనర్సింహా సమక్షంలో యువజన కాంగ్రెస్ నాయకుడు అరగొండ అరవింద్ జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. సంగారెడ్డిలోని మంత్రి నివాసంలో అరవింద్ చేత కేక్ కట్ చేయించి ,తినిపించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయురారోగ్యాలతో వందేళ్లు జీవించాలని దీవించారు. జన్మదిన సందర్భంగా బిజిలీపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్ద ఎత్తున యువ నాయకుడి వెంట తరలివెళ్లారు.మంత్రి సమక్షంలో జరిగిన జన్మదిన వేడుకల సందర్భంగా నాయకుల నుండి పెద్ద ఎత్తున శుభాకాంక్షలు వెలువెత్తాయి. యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధానకార్యదర్శి వినయ్‌గౌడ్, మాజీ ఎంపిటీసీ సంగప్ప, భూత్కూర్ సర్పంచ్ విశ్వాస్,నాయకులు శివశంకర్, విజయ్, కె.రాజు, టి.నర్సింలు, శంకర్, సాయిలు, ఎస్. రాజు, మల్లేశం, సంగమేశ్వర్,బి. సంగమేశ్, రజిని, శేఖర్, శివతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## ప్రయాణంలో క్షణం ఆదమరిచిన కనురెప్పపాటులో ప్రమాదం

* **ముస్తాబాద్ ఎస్సై సిహెచ్.గణేష్**
* **నో హెల్మెట్ నో పెట్రోల్ కాన్సెప్ట్‌పై అవగాహన**




ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: రోడ్డు ప్రయాణంలో క్షణం ఆదమరిచిన కనురెప్ప పాటులో ప్రమాదం జరిగేందుకు అవకాశాలుంటాయని ముస్తాబాద్ ఎస్సై సిహెచ్.గణేష్ తెలిపారు. ముస్తాబాద్ మండలంలోని హెచ్‌పి పెట్రోల్ బంక్‌లో నో హెల్మెట్ నో పెట్రోల్ కాన్సెప్ట్‌పై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించడం వల్ల దురదృష్టవశాత్తు ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు ప్రాణాపాయం ఉంచి బయటపడవచ్చని తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపటం వల్ల వాహనంపై నియంత్రణ కొల్పోయి ప్రమాదాలకు గురయ్యే అవకాశాలుంటాయని, ఎవరూ మద్యం సేవించి వాహనాలు నడపవద్దని అన్నారు. వాహనదారులు పెట్రోల్ కోసం బంక్‌కు వచ్చిన తరుణంలో ద్విచక్ర వాహనంపై వచ్చే వారు హెల్మెట్ ధరిస్తేనే పెట్రోల్ పోయాలని, లేకపోతే పోయవద్దని సూచించారు. ట్రాఫిక్ నియమ, నిబంధనలను పాటిస్తూ ప్రతి ఒక్క వాహనదారుడు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల రహిత సమాజం మనందరి బాధ్యతని అన్నారు. ఈ కార్యక్రమంలో పెట్రోల్ బంక్ వర్కర్స్ పిల్లి నరసింహులు, గుగ్గిల సంతోష్, పల్లపు శ్రీనివాస్, రాకేష్, నరేంద్ర చారి తదితరులున్నారు.

## బాల కార్మికుల నిర్మూలనకు సమిష్టి చర్యలు

* **ఆపరేషన్ స్మైల్‌ను విజయవంతం చేయాలి – జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్**



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: బాల కార్మికుల నిర్మూలన లక్ష్యంగా ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ స్మైల్ కార్యక్రమాన్ని అన్ని శాఖల సమన్వయంతో పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ తెలిపారు. ఐడీఓసీ కార్యాలయంలో జరిగిన సమీక్ష సమావేశంలో పరిశ్రమలు, హోటళ్లు, ఇటుక బట్టీలు తదితర ప్రాంతాల్లో ప్రత్యేక బృందాలతో తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. బాల కార్మికులను పనిలో పెట్టుకున్న యజమానులపై కఠిన చర్యలు తీసుకోవాలని, సహాయం అవసరమైన పిల్లల సమాచారం కోసం డయల్ 100, 1098 టోల్ ఫ్రీ నెంబర్లపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.రెస్క్యూ చేసిన పిల్లలను పాఠశాలల్లో చేర్పించి విద్య అందించాలని, అవసరమైతే సంక్షేమ పథకాల ద్వారా సహాయం అందించాలని తెలిపారు. ఈ ఏడాది జనవరి 1 నుంచి ఇప్పటివరకు జిల్లాలో 25 మంది పిల్లలను ఆపరేషన్ స్మైల్ ద్వారా రక్షించినట్లు కలెక్టర్ వెల్లడించారు.

## ప్రైవేటు బస్సు దగ్ధం.. ముగ్గురి మృతి





అర్ధరాత్రి సమయం.. ప్రయాణికులతో వెళ్తున్న ఓ ప్రైవేటు బస్సు టైరు పేలడంతోఅదుపుతప్పింది.. డివైడర్ మీదుగా దూసుకెళ్లి రోడ్డు అవతలివైపు ఎదురుగా వస్తున్న లారీని ఢీకొని దగ్ధమైంది.. ఈ ఘటనలో ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందగా.. పలువురు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నెల్లూరు నుంచి 36 మంది ప్రయాణికులతో హైదరాబాద్‌కు వెళ్తున్న ఓ ఏఆర్‌బీసీవీఆర్ ప్రైవేటు ట్రావెల్స్ బస్సు బుధవారం అర్ధరాత్రి 2 గంటలు దాటాక నంద్యాల జిల్లా శిరివెళ్ల మండలం శిరివెళ్లమెట్ట వద్ద ప్రమాదానికి గురైంది. టైరు పేలడంతో అదుపుతప్పి డివైడర్ దాటి ఎదురుగా వస్తున్న కంటైనర్ లారీని ఢీకొంది. ఈ ప్రమాదంలో బస్సు డ్రైవర్‌తో పాటు లారీ డ్రైవర్, క్లీనర్ మృతిచెందారు. ప్రమాదం జరిగిన తర్వాత బస్సుకు మంటలు వ్యాపించారు. ఆ దారిన వెళ్తున్న డీసీఎం డ్రైవర్ వాహనాన్ని ఆపి బస్సు అద్దాలను పగులగొట్టడంతో ప్రయాణికులు ప్రాణాలతో బయటపడ్డారు. కిటికీల్లోంచి దూకేయడంతో పదిమందికిపైగా ప్రయాణికులు స్వల్పంగా గాయపడ్డారు. మంటలు విస్తరించడంతో లారీ కూడా కాలిపోయింది. బస్సు డ్రైవరుతో పాటు లారీ చోదకుడు, క్లీనర్ మృతదేహాలు గుర్తుపట్టలేని విధంగా కాలిపోయాయి. ప్రయాణికుల లగేజీ మొత్తం బూడిదైంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను నంద్యాల సర్వజన ఆసుపత్రికి తరలించారు.

# గ్రామాలలో ఆదర్శంతమైన పరిపాలన అందించాలి

* **పారిశుధ్య పనులు, మంచినీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలి**
* **ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్**
* **నూతన సర్పంచులకు శిక్షణ తరగతులు**





ప్రజాస్ఫూర్తి, సిరిసిల్ల : నూతనంగా ఎన్నికైన సర్పంచ్‌లు గ్రామాలలో ఆదర్శంతమైన పరిపాలన అందించాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. తెలంగాణ ప్రభుత్వం తెలంగాణ ఇన్స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్మెంట్ ఆదేశాల మేరకు జిల్లా యంత్రాంగం ఆద్వర్యంలో ఇల్లంతకుంట, తంగళ్ళపల్లి మండలాల సర్పంచులకు వేములవాడ పట్టణంలోని జవహర్ లాల్ నెహ్రూ బీఈడీ కళాశాలలో ఐదు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తుండగా బుధవారం ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. నూతనంగా ఎన్నికైన సర్పంచులకు అభినందనలు తెలియజేశారు. పంచాయతీ రాజ్ చట్టం ప్రకారం 1/3 కోరం ఉండేలా చూసుకోవాలని, ప్రతి ఏడాది ఆరు గ్రామసభలు నిర్వహించాలని, గత సమావేశం అంశాలు, తీర్మానాలు చర్చించాలని, ప్రస్తుత సమావేశంలో ప్లానింగ్, అమలుపై చర్చించాలని సూచించారు. మహిళల కోసం, వృద్ధులు, అనాథలు, ప్రకృతి విపత్తులు, అత్యవసర ఆరోగ్య సమావేశాలు నిర్వహించాలని తెలిపారు. నిధుల దుర్వినియోగం కాకుండా చూడాలని, ప్రతి అభివృద్ధి పనినీ గ్రామ పంచాయతీ తీర్మానం మేరకే చేయాలని స్పష్టం చేశారు. అన్ని రిజిస్టర్ల నిర్వహణ సక్రమంగా ఉండాలని సూచించారు. ప్రతి గ్రామంలో పారిశుధ్య పనులు నిత్యం చేయించాలని, ఇండ్లు, వివిధ ప్రాంతాల్లో నీరు నిలువ ఉండకుండా చూడాలని ఆదేశించారు. ప్రతి గ్రామంలోని డంపింగ్ యార్డు, సెగ్రిగేషన్ షెడ్లు వినియోగంలోకి తీసుకురావాలని, తడి, పొడి చెత్తను వాహనాల్లో సేకరించి, వేరు చేసి డంపింగ్ యార్డుకు తరలించాలని తడి చెత్తను సేంద్రియ ఎరువుగా తయారు చేయాలని సూచించారు. పొడి చెత్తను విక్రయించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ చెత్తను తగలబెట్టవద్దని స్పష్టం చేశారు. దోమల నివారణపై ప్రత్యేక దృష్టిసారించాలని పేర్కొన్నారు. ప్రతి వారంలో శుక్రవారం డ్రై డేగా పాటించాలని, ఇండ్లలో మొక్కల కుండీలు, కూలర్లు, వినియోగించిన కొబ్బరి బొండాల్లో నీరు నిలువ ఉండకుండా చూడాలని తెలిపారు. మంచినీటి సరఫరా పై దృష్టి సారించాలని, ప్రతి నెలా 1, 11, 21వ తేదీల్లో ట్యాంక్ ల్లో నీటిని తీసివేసి, బ్లీచింగ్ పౌడర్ తో శుభ్రం చేయించాలని, సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి దగ్గరుండి చూడాలని తెలిపారు. రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకొని గ్రామాల్లో ఉన్న నీటి వనరులు చూసుకోవాలని సూచించారు. ప్రస్తుతం నీటి సరఫరా, రానున్న రోజుల్లో నీటి సరఫరా ఏమి కావాలో ముందుగానే అంచనా వేయాలని పేర్కొన్నారు. దానికి అనుగుణంగా ఒక ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని తెలిపారు. గ్రామ బడ్జెట్ లో 10 శాతం మొక్కల పెంపకం, సంరక్షణకు తప్పనిసరిగా వాడాలని స్పష్టం చేశారు. వీధి దీపాల నిర్వహణను చూసుకోవాలని తెలిపారు. ప్రభుత్వ ఆదాయ వనరుల కేటాయింపుతో పాటుగా స్థానిక ఆదాయ వనరులు చూసుకోవాలని సూచించారు. ఇంటి, ఇతర పన్నులు వసూలు చేయాలని, వివిధ దుకాణాలు కొనసాగించేవారికి లైసెన్సులు జారీ చేయాలని, ప్రతి నూతన గృహ నిర్మాణాలకు పర్మిషన్ ఇవ్వాలని తెలిపారు. వీటి ద్వారా ప్రతి గ్రామ పంచాయతీకి ఆదాయం వస్తుందని వెల్లడించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు పరిశీలించాలని పేర్కొన్నారు. లబ్ధిదారులతో పనులు వేగంగా పూర్తి చేసేలా చూడాలని సూచించారు. ప్రతి గ్రామ పంచాయతీకి నూతన బిల్డింగ్ ఉండాలని, పెద్ద పెద్ద గ్రామ పంచాయతీలలో మహిళా సంఘాలకు భవనాలు నిర్మించుకునేందుకు రూ. 10 లక్షల నిధులు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ నుంచి మంజూరు అవుతాయని, మిగతా రూ. 10 లక్షలు గ్రామ పంచాయతీ లేదా మహిళా సంఘాల ఖాతాల నిధులు వినియోగించేలా ప్రతిపాదనలు పంపాలని సూచించారు. హెల్త్ సబ్ సెంటర్లు, అంగన్వాడి భవనాలు తుది దశల్లో ఉంటే దృష్టిసారించి పనులు పూర్తి చేయించాలని ఆదేశించారు. నీటి సరఫరా, విద్యుత్ కనెక్షన్ ఇతర పనులు పూర్తి చేయించాలని తెలిపారు. ఉత్తమ, వినూత్న, ఆదర్శ పాలన, ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసే గ్రామ పంచాయతీ వివరాలు కేంద్ర ప్రభుత్వానికి పంపుతామని ఇంచార్జి కలెక్టర్ తెలిపారు. సర్పంచులు ఉత్తమ పనితీరుతో ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన పాలన అందించాలని ఆకాంక్షించారు. శిక్షణ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి షరీఫ్ఫుద్దిన్, తహసీల్దార్ విజయ ప్రకాశ్ రావు వివిధ మండలాల ఎంపీడీఓలు తదితరులు పాల్గొన్నారు.



## చట్టాలు, హక్కులపై అవగాహన అవసరం

- **రాజన్న సిరిసిల్ల బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ శ్రీనివాస రావు**




ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: చట్టాలు, హక్కులపై అవగాహన అవసరం రాజన్న సిరిసిల్ల బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ శ్రీనివాస రావు అన్నారు. ముస్తాబాద్ మండలం ఆవునూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాల్య వివాహాల నిషేధం, వివిధ బాలల చట్టాలు, విద్యా హక్కు చట్టం, ఇతర చట్టాలపై బుధవారం అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలల హక్కులు, వారికి అవసరమైన వివిధ చట్టాల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బాల బాలికలపై జరుగుతున్న వివిధ ఆకృత్యాల పట్ల, సైబర్ నేరాల పట్ల ఉపాధ్యాయులు అవగాహన కల్పించి, వారిని నేరాలకు బాధితులు కాకుండా చూడాలని కోరారు. నేరాలు జరిగినప్పుడు సంప్రదించాల్సిన హెల్ప్ లైన్ నెంబర్ల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు ఆడెపు వేణు, తవుటు మధుసూదన్, బి.బాలయ్య, రాజు, ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయురాలు వి.శారద, ఇతర ఉపాధ్యాయులు, పారా లీగల్ వాలంటీర్ ఆర్‌పి విక్రమ్, ఇతర జిల్లా న్యాయ సేవాధికార సిబ్బంది పాల్గొన్నారు.



## మంత్రి సహకారంతో ప్రతి సమస్యను పరిష్కరిస్తా..

- **కేరూర్ గ్రామ సర్పంచ్ కార్తీక్‌గౌడ్**
- **నూతన ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటుపై గ్రామస్తుల హర్షం**

అందోలు, ప్రజాస్ఫూర్తి: రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సి.దామోదర రాజనర్సింహా సహకారంతో గ్రామంలోని ప్రతి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని కేరూర్ గ్రామ సర్పంచ్ పెద్దపట్ల కార్తీక్‌గౌడ్ అన్నారు. కొంతకాలంగా గ్రామంలో విద్యుత్ సమస్య ఏర్పడడం పట్ల సమస్యను పరిష్కరించే దిశగా సర్పంచ్ కార్తీక్‌గౌడ్ ఇటీవల మంత్రి దామోదర్ దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే కేరూర్ గ్రామంలో నెలకొన్న విద్యుత్ సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. దీంతో అధికారులు బుధవారం గ్రామానికి చేరుకొని విద్యుత్ సమస్య పరిష్కణలో భాగంగా నూతనంగా సింగల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్ ను బిగించారు. ఎంతో కాలంగా దుర్కొంటున్న విద్యుత్ సమస్యను మంత్రి చొరవతో తక్షణ పరిష్కారం లభించడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ కార్తీక్ గౌడ్ మాట్లాడుతూ ప్రతి సమస్యకు పరిష్కారాన్ని చూపుతూ గ్రామాభివృద్దే ధ్యేయంగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. గ్రామంలో నీటి ఎద్దడిని తీర్చేందుకు గ్రామంలో బోరు మోటర్లను తవ్వించినట్లు గుర్తు చేశారు. తనపై నమ్మకంతో గ్రామ ప్రజలు తనను సర్పంచ్‌గా గెలిపించడం పట్ల వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా గ్రామాభివృద్ధికి పాటుపడుతానన్నారు. మంత్రి సహకారంతో గ్రామానికి అధిక నిధులు వెచ్చించేలా కృషి చేసి కేరూర్ గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతానన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన వారందరికీ అందేలా చూస్తానన్నారు. కార్యక్రమంలో గ్రామ కాంగ్రేస్ పార్టీ అధ్యక్షుడు క్రిష్ణాగౌడ్, ఉప సర్పంచ్ రాములు, మార్కెట్ డైరెక్టర్ పాపయ్య, మాజీ ఉప సర్పంచ్ కుమార్, వార్డు సభ్యులు, నాయకులు, విద్యుత్ అధికారులు పాల్గొన్నారు.

## రహదారులపై ప్రయాణించే ప్రతి ఒక్కరి ప్రాణ భద్రతే పోలీసుల ప్రధాన ధ్యేయం

* **డీసీపీ ట్రాఫిక్ (మేడ్చల్) జె. రంజన్ రతన్ కుమార్**



కూకట్ పల్లి, ప్రజాస్ఫూర్తి : రహదారులపై ప్రయాణించే ప్రతి ఒక్కరి ప్రాణ భద్రతే పోలీసు శాఖ యొక్క ప్రధాన ధ్యేయమని డీసీపీ ట్రాఫిక్ (మేడ్చల్) జె. రంజన్ రతన్ కుమార్ స్పష్టం చేశారు. రోడ్డు భద్రత వారోత్సవాల సందర్భంగా కూకట్‌పల్లి ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అరైవ్ అలైవ్ కార్యక్రమాన్ని బుధవారం కూకట్‌పల్లి ట్రాఫిక్ పోలీస్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలను నియంత్రించి, ప్రజల్లో బాధ్యతాయుతమైన వాహనచలనంపై అవగాహన పెంపొందించడమే లక్ష్యంగా ఈ సదస్సును ఏర్పాటు చేశారన్నారు. చిన్న నిర్లక్ష్యం కూడా పెద్ద ప్రమాదాలకు కారణమవుతుందని, అందువల్ల వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటిస్తూ క్రమశిక్షణతో వాహనాలు నడపాలని సూచించారు. హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగం తప్పనిసరి అని, మద్యం సేవించి వాహనం నడపడం నేరమని తెలిపారు. వేగ పరిమితిని అతిక్రమించకూడదని, డ్రైవింగ్ సమయంలో మొబైల్ ఫోన్ వినియోగం అత్యంత ప్రమాదకరమని హెచ్చరించారు. రహదారి భద్రతపై ప్రజలతో ప్రతిజ్ఞ చేయించి, ప్రమాదాల నివారణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములుగా మారాలని పిలుపునిచ్చారు. ఈ అవగాహన సదస్సులో అడిషనల్ డీసీపీ వీరన్న, ట్రాఫిక్ ఏసీపీలు ఎస్. గిరి ప్రసాద్, వెంకటయ్య, వెంకట్ రెడ్డి, సీఐలు తిమ్మప్ప, ప్రశాంత్, జానయ్య, శ్రీనివాస్ రావు, వెంకటేశ్వర రావు, విద్యాసాగర్ రెడ్డి, బి. మధుసూదన్, అప్పలనాయుడు, జంగయ్య తదితర అధికారులు పాల్గొన్నారు.

## ప్రజలు ఎదుర్కోంటున్న సమస్యలను పరిష్కరించాలని కార్పొరేటర్కు వినతి



జగద్గిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి : ప్రజలు ఎదుర్కోంటున్న సమస్యలను పరిష్కరించాలని డివిజన్ పరిధిలోని వివిధ కాలనీల వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు బుధవారం రంగారెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ విజయ్ శేఖర్ గౌడ్ ను చింతల్ లోని ఆయన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి వినతి పత్రాలను అందజేశారు. అనంతరం ప్రజలు ఎదుర్కోంటున్న పలు సమస్యలను కార్పొరేటర్ దృష్టికి తీసుకవచ్చారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ విజయ్ శేఖర్ గౌడ్ మాట్లాడుతూ కాలనీలలో ఉన్న సమస్యలు ఉన్నత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో నాయకులు, మహిళా నాయకురాలు తదితరులు పాల్గొన్నారు.

## కుక్కల సంహారం..
# వివాదం సుప్రీంకోర్టుకు



హైదరాబాద్: రంగారెడ్డి జిల్లా నందిగామ మండలంలో సింబయాసిస్ యూనివర్సిటీ, పరిసర ప్రాంతాల్లో ఒకే రోజు 40 కుక్కలను చంపిన సంఘటనలో జోక్యం చేసుకోలేమంటూ హైకోర్టు బుధవారం స్పష్టం చేసింది. ప్రస్తుతం శునకాలకు సంబంధించిన అంశాన్ని సుప్రీంకోర్టు విచారిస్తున్నందున ఈ పిటిషన్‌ను అక్కడికి బదిలీ చేయాలని రిజిస్ట్రీని ఆదేశించింది. సింబయాసిస్ యూనివర్సిటీతోపాటు పరిసర ప్రాంతాల్లో పంచాయతీ సిబ్బంది 40 వీధికుక్కలను సామూహికంగా చంపారని, బాధ్యులపై క్రిమినల్ కేసు నమోదు చేసేలా ఆదేశాలు జారీ చేయాలని న్యాయవాది వి.రిషిహాస్‌రెడ్డి హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ జి.ఎం.మొహియుద్దీన్ ధర్మాసనం విచారణ చేపట్టింది. కుక్కలను చంపినట్లు ఆధారాలు ఏమున్నాయి? పత్రికలు, సామాజిక మాధ్యమాల్లోనివి కాకుండా యూనివర్సిటీ విద్యార్థులు అఫిడవిట్ ఇస్తారా? అంటూ ప్రశ్నించింది. ఈ పిటిషన్‌ను సుప్రీంకోర్టుకు బదిలీ చేస్తున్నామంటూ ఉత్తర్వులు జారీ చేసింది.


## ప్రజాస్ఫూర్తి క్యాలెండర్ ను
# ఆవిష్కరించిన మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి

* **డిజిటల్ యుగంలో పత్రికలకు గుర్తింపు తగ్గదు**

(ప్రజాస్ఫూర్తి, హైదరాబాద్) : ప్రజాస్ఫూర్తి దిన పత్రిక 2026 క్యాలెండర్ ని తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి ఆవిష్కరించారు. అకాడమీ కార్యాలయంలో పత్రిక ఎడిటర్ బాలరాజు గౌడ్ అధ్వర్యంలో కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ పత్రికలు నిష్పక్ష పాతంగా వ్యవహరిస్తూ, సమగ్ర సమాచారాన్ని సమాజాన్ని అందజేయాలని సూచించారు. పత్రికల నిర్వహణలో పెద్ద, చిన్న అనే తేడాలు ఉండవని స్పష్టం చేశారు. ప్రజాస్ఫూర్తి దినపత్రిక ప్రజలకు మరింత గా చేరువ కావాలనీ ఆకాంక్షించారు. డిజిటలైజేషన్ అవుతున్న తరుణంలో పత్రికలకు ఎలాంటి డోకా ఉండదని ధీమాను వ్యక్తపరిచారు. ఈ కార్యక్రమంలో చిన్న మధ్య తరహా పత్రికల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు







యూసుఫ్‌బాబు, ప్రధాన కార్యదర్శి అశోక్, నాయకులు వెంకటయ్య, కుత్బుల్లాపూర్ ప్రెస్ క్లబ్ వర్కింగ్ ప్రెసిడెంట్ సాయిబాబా, ప్రజాస్ఫూర్తి దినపత్రిక విలేఖరులు శ్రీధర్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# సస్పెండైన అదనపు కలెక్టర్ ఇంట్లో సోదాలు.. భారీగా అక్రమాస్తుల గుర్తింపు

హనుమకొండ: సస్పెన్షన్‌లో ఉన్న హనుమకొండ అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వెంకట్ రెడ్డిపై ఆదాయానికి మించిన ఆస్తుల కేసు నమోదైంది. దీంతో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు అతడి ఇల్లు సహా ఏడు చోట్ల సోదాలు చేపట్టారు. సోదాల్లో వెంకట్ రెడ్డి వద్ద భారీగా అక్రమాస్తులు ఉన్నట్లు తేల్చారు. రూ.4.65 కోట్లు విలువ చేసే విల్లాతోపాటు ఒక ఫ్లాట్ ఉన్నట్లు గుర్తించారు. రూ.60లక్షలు విలువ చేసే వ్యాపార దుకాణం, రూ.65లక్షలు విలువ చేసే ఎనిమిది ఓపెన్ ప్లాట్లు, 14.5 ఎకరాల వ్యవసాయ భూమి ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. బహిరంగ మార్కెట్లో వీటి విలువ రూ.వందల కోట్లు ఉంటుందని అంచనా వేస్తున్నారు. వీటితోపాటు ఇంట్లో రూ.30 లక్షల నగదుతో పాటు రూ.44.03 లక్షల బ్యాంక్ బ్యాలెన్స్, 297



గ్రాముల బంగారు ఆభరణాలు ఉన్నట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. గతనెలలో రూ.60వేల లంచం తీసుకుంటూ వెంకట్ రెడ్డి ఏసీబీకి చిక్కారు. పాఠశాలకు అనుమతి విషయంలో ఆయన అవినీతికి పాల్పడ్డారు. దీంతో ప్రభుత్వం ఆయన్ను సస్పెండ్ చేసింది.

## సింగరేణిపై సీబీఐ దర్యాప్తునకు
# రాష్ట్రం ముందుకొస్తే కేంద్రం పరిశీలిస్తుంది: కిషన్‌రెడ్డి

దిల్లీ: దేశ బొగ్గు ఉత్పత్తిలో సింగరేణి కీలకపాత్ర పోషిస్తోందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. అయితే, తెలంగాణ వచ్చాక సింగరేణికి ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెప్పారు. సింగరేణి విషయంలో వివాదం నెలకొన్న నేపథ్యంలో ఆయన దిల్లీలో మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు సింగరేణిని అన్ని రకాలుగా విధ్వంసం చేశాయని ఆరోపించారు. నైనీ కోల్ బ్లాక్ విషయంలో బీఆర్ఎస్ బాటలోనే కాంగ్రెస్ వెళ్తోందని విమర్శించారు. సింగరేణి రాజకీయ ప్రయోగశాలగా మారిందన్నారు. "బీఆర్ఎస్ హయాంలో అనేక రకాల అక్రమాలు జరిగాయి. రాష్ట్ర విద్యుత్ సంస్థలకు విద్యుత్ కోసం తెలంగాణకు నైనీ కోల్ బ్లాక్ కేటాయించారు. దానికి కేంద్రం



నుంచి అన్ని రకాల సహాయ సహకారాలున్నాయి. గతంలో నైనీ కోల్ బ్లాక్ టెండర్ల ప్రక్రియలో సీఎం జోక్యం చేసుకొని రద్దు చేశారు. సింగరేణి మైనింగ్‌కు ముందుకొస్తే బీఆర్ఎస్ ప్రైవేటు సంస్థకు కట్టబెట్టింది. బొగ్గు గనుల కొరత ఉందని తెలిసి ప్రైవేటు వ్యక్తులకు ఎలా ఇస్తారు? సింగరేణి, నైనీ కోల్ బ్లాక్ అక్రమాలపై చర్చ జరగాలి. సీబీఐ దర్యాప్తునకు రాష్ట్రం ముందుకొస్తే కేంద్రం పరిశీలిస్తుంది" అని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు.

## అభివృద్ధి అంటే భవనాల నిర్మాణమే కాదు..
# ప్రజల జీవితాల్లో మార్పు: భట్టి విక్రమార్క

ధర్మపురి గ్రామీణం: తెలంగాణలో విద్య, వైద్యం, అన్ని వర్గాల సంక్షేమంతోపాటు అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. జగిత్యాల జిల్లా ధర్మపురిలో బుధవారం రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల భవనం, రూ.10 కోట్లతో ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనం, రూ.17 కోట్లతో వాటర్ ప్లాంటు నిర్మాణం, రూ.2 కోట్ల అంచనా వ్యయంతో ఎస్సీ బాలుర వసతిగృహ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం స్థానికంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. "జిల్లాలో ఇంటిగ్రేటెడ్ మోడల్ పాఠశాల నిర్మాణానికి రూ.200 కోట్లు కేటాయించాం. ఒకే ప్రాంగణంలో విద్య, ఆటలు, హాస్టల్, ల్యాబ్స్, డైనింగ్, క్రీడలు అన్నీ ఉండేలా ప్రణాళిక రూపొందించాం. పేద కుటుంబాల





పిల్లలకు మంచి అవకాశాలు ఇస్తే వారు సమాజంలో ఉన్నత స్థాయికి ఎదుగుతారని మేం నమ్ముతున్నాం. వెనుకబడిన వర్గాలు చదువులు, ఉద్యోగాల్లో, సమాజ నిర్మాణంలో ముందుకు రావాలంటే ప్రభుత్వం తరపున చేయాల్సిన కృషి చేస్తున్నాం. అభివృద్ధి అంటే కేవలం భవనాల నిర్మాణం కాదు, ప్రజల జీవితాల్లో మార్పు రావడం. ఎన్నికల సమయంలో చేసిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నాం. పారదర్శకత, నిబద్ధత, సంకల్పంతో ముందుకు సాగుతున్నాం" అని భట్టి అన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, అడ్లూరి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## జీహెచ్ఎంసీ విభజనపై
# ఫిబ్రవరి 10న స్పష్టమైన నిర్ణయం: పొన్నం ప్రభాకర్

హైదరాబాద్: జీహెచ్ఎంసీ విభజనపై ఫిబ్రవరి 10న ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయాన్ని వెల్లడిస్తుందని హైదరాబాద్ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. బల్దియా విభజనలో ఎలాంటి సందేహాలు అవసరం లేదన్నారు. ఫిబ్రవరి 10తో జీహెచ్ఎంసీ పాలకవర్గం గడువు ముగియనున్న నేపథ్యంలో జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో మేయర్, డిప్యూటీ మేయర్,



జీహెచ్ఎంసీ కమిషనర్లతో కలిసి అధికారులకు దిశానిర్దేశం చేశారు. హైదరాబాద్ మహానగరాన్ని 12 జోన్లు, 60 సర్కిళ్లు, 300 డివిజన్లుగా విభజించిన సందర్భంగా ఆయా జోనల్ కమిషనర్లు, సర్కిల్ అధికారులను పరిచయం చేసుకున్న మంత్రి.. ప్రజా సమస్యలను పరిష్కరించే బాధ్యత ఇకపై పూర్తిగా అధికారులదేనన్నారు. పారిశుద్ధ్యం, విద్యుత్, తాగునీరు ఇలా ప్రతి అంశంలోనూ ప్రశ్నించేవాళ్లు ఎక్కువ అవుతారని, వారికి బదులు ఇచ్చేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. జోనల్ స్థాయిలో అధికారులతో పనిచేయించే బాధ్యత కమిషనర్‌దేనని అన్నారు.

# జర్నలిస్టులకు హెల్మెట్లు ప్రధానం చేసిన మంత్రి సీతక్క..

జర్నలిస్టులకు హెల్మెట్లు ప్రధానం చేసిన మంత్రి సీతక్క.. వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ, వెనక కూర్చునే వ్యక్తులతో తప్పకుండా ధరించి ప్రాణాలను రక్షించుకోవాలని రాష్ట్ర మంత్రి ధన సూరి అనసూయ (సీతక్క) అన్నారు. తెలంగాణలో రోడ్డు భద్రత కోసం తెలంగాణ పోలీసులు నిర్వహించే Arrive Allive ప్రోగ్రాంలో భాగంగా బుధవారం ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలో ప్రింట్ అండ్



ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులకు వాహనం నడిపే వారికి, వెనుక కూర్చునే వారికి హెల్మెట్లను తప్పకుండా ధరించాలని ఆర్మూర్ ఏసిపి జే వెంకటేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర మంత్రి సీతక్క హెల్మెట్లను ప్రధానం చేశారు. రోడ్డు ప్రమాదాల నివారణకు వాహనదారుల ప్రాణాల రక్షణకు హెల్మెట్లను జర్నలిస్టులకు ఉచితంగా పంపిణీ చేసిన ఆర్మూర్ పోలీసులను ఆర్మూర్ పట్టణంలో పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర విత్తనా భివృద్ధి సంస్థ చైర్మన్ సుంకేట అన్వేష్ రెడ్డి, ఆర్మూర్ ఏసిపి వెంకటేశ్వర రెడ్డి, ఆర్మూర్ ఎస్హెచ్ఓ సత్యనారాయణ గౌడ్, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.






## హెచ్ఎండీఏ 'మహా' ప్రాజెక్టులు..
## పరిపాలనపరమైన అనుమతులిచ్చిన ప్రభుత్వం

హైదరాబాద్: మహానగరంలో రవాణా వ్యవస్థను మరింత మెరుగుపర్చేందుకు హెచ్ఎండీఏ కీలక ప్రాజెక్టులకు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. ఈ మేరకు రూ.వందల కోట్ల ప్రాజెక్టులకు పరిపాలనపరమైన అనుమతులను మంజూరు చేసింది. హైదరాబాద్‌కు 'గేట్ వే'లా బుద్వేల్ వద్ద ప్రపంచస్థాయి ట్రంపెట్ ఇంటర్ ఛేంజ్‌కు అంతర్గత నిధులతోపాటు రూ.488 కోట్లు, బంజారాహిల్స్‌లోని ఐసీసీసీ నుంచి శిల్పా లేఅవుట్ వరకు ఎలివేటెడ్ కారిడార్ 3 నిర్మాణం కోసం రూ.1,656 కోట్లు, ఎంజీఐటీ వద్ద శంకర్‌పల్లి రోడ్డు నుంచి మణికొండ వరకు పైపులైన్ రోడ్ విస్తరణకు రూ.110 కోట్లు, నానక్‌రాంగూడ నుంచి గచ్చిబౌలి వరకు ఓఆర్ఆర్ ఎడమ వైపు ప్రధాన రహదారి విస్తరణకు రూ.26.50 కోట్ల పరిపాలనపరమైన అనుమతులు ఇచ్చినట్లు హెచ్ఎండీఏ వెల్లడించింది. ఈ కీలక ప్రాజెక్టులు నగరంలో ట్రాఫిక్ రద్దీని తగ్గించడంతోపాటు దీర్ఘకాలిక అభివృద్ధికి ఎంతో తోడ్పడతాయని హెచ్ఎండీఏ అధికారులు భావిస్తున్నారు.

# వారంలోపు రంజాన్ ఏర్పాట్లపై సమావేశాన్ని నిర్వహించాలి..

* **మంత్రి అజారుద్దీన్**

రంజాన్, షాదీ ముబారక్ పథకం, పీఎంజేవీకే అంశాలపై మైనార్టీ సంక్షేమ శాఖ అధికారులతో మంత్రి అజారుద్దీన్ బుధవారం హైదరాబాద్‌లో సమీక్షా సమావేశం నిర్వహించారు. రాబోయే రంజాన్ ఏర్పాట్లపై చేపట్టాల్సిన కార్యక్రమాలు, షాదీ ముబారక్ బడ్జెట్ వినియోగం, ప్రధానమంత్రి జన్ వికాస్ కార్యక్రమం కింద ప్రాజెక్టులను త్వరగా పూర్తి చేయడం, పనుల స్థితిగతులపై ఆయన అధికారులను అడిగి తెలుసుకున్నారు. జిల్లా ఇన్చార్జ్ మంత్రులు, జిల్లా కలెక్టర్లు, ప్రజాప్రతినిధులు, మత పెద్దలను ఆహ్వానించి.. జిల్లాల్లో అవసరమైన అన్ని రంజాన్ ఏర్పాట్లపై



వారంలోపు సమావేశాన్ని నిర్వహించాలని అజారుద్దీన్ సూచించారు. షాదీ ముబారక్ పథకంలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిష్కరించాలని, ఇతర పథకాలను కూడా వేగంగా అమలు చేయాలని మంత్రి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రధాన మంత్రి జన్ వికాస్ కార్యక్రమం కింద ఉన్న ప్రాజెక్టులను ప్రాధాన్యత క్రమంలో పర్యవేక్షించి, సకాలంలో పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని, ఆ భవనాలను టీజీఎంఆర్ఈఐఎస్ కు అప్పగించాలన్నారు. క్రిస్మస్ వేడుకల కోసం విడుదల చేసిన బడ్జెట్‌ను చర్చ్ ల అభివృద్ధి పనులకు సద్వినియోగం చేసుకోవాలని అజారుద్దీన్ సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీతో పాటు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# అంతరిక్షం నుంచి చూస్తే.. ఆ గొడవలు చాలా 'సిల్లీ' : సునీతా విలియమ్స్


అంతరిక్షయానం తనలో ఎంతో మార్పు తీసుకువచ్చిందని భారత సంతతి వ్యోమగామి సునీతా విలియమ్స్ పేర్కొన్నారు. అంతరిక్షం నుంచి భూమిని ఓ గ్రహంగా చూసినప్పుడు.. జీవితం పట్ల తన దృక్పథాన్ని మార్చివేసిందన్నారు. పలు అంశాలపై మనుషుల మధ్య విభేదాలు, గొడవలు పడటం చాలా సిల్లీగా అనిపిస్తుందన్నారు. దిల్లీలో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె.. 'ఐస్ ఆన్ స్టార్స్, ఫీట్ ఆన్ ది గ్రౌండ్' అనే అంశంపై మాట్లాడారు. ఈ సందర్భంగా అంతరిక్షయానంలో తన అనుభవాలను పంచుకున్నారు. ''మనం అంతరిక్షానికి వెళ్లినప్పుడు ప్రతిఒక్కరు తమ ఇల్లు ఎక్కడుందని వెతకాలనే అనుకుంటారు. నా తండ్రి భారత్‌కు చెందిన వారు.. తల్లి స్లోవేనియా వ్యక్తి. అందుకే మొదట ఈ ప్రదేశాల గురించే చూశా. తొలుత నిర్దిష్ట ప్రదేశం (ఇల్లు) కోసం వెతికినా.. చివరకు భూమి అంతా ఒకటేనని తెలుసుకుంటాం. సముద్రాలు, మారుతున్న కాలాలు, ధృవాలు.. ఇలా అంతరిక్షం నుంచి అద్భుతమైన ఈ గ్రహాన్ని



చూసినప్పుడు జీవితం పట్ల ఆలోచనా ధోరణి మారుతుంది. వ్యక్తుల మధ్య విభేదాలపై మన అభిప్రాయాన్ని మారుస్తుంది. మనమంతా ఒక్కటే కదా.. కలిసి మెలసి పనిచేయాలనే భావనను కలిగిస్తుంది. అంతేకాదు.. ఓ ఇల్లాలిగా కుటుంబంలో వాదనల గురించి అర్థం చేసుకుంటా. కానీ, వాస్తవం ఏంటంటే.. అంతరిక్షం నుంచి భూమిని చూసినప్పుడు ఇవి సిల్లీగా అనిపిస్తాయి'' అని సునీతా విలియమ్స్ పేర్కొన్నారు. ఎప్పుడైనా దేనిగురించైనా భయపడ్డారా? అనే ప్రశ్నకు బదులిస్తూ.. చాలా విషయాలకు భయపడతానని, తాను నివాసముండే చోట ఎలుగుబంట్లు ఉన్నాయని నవ్వుతూ సమాధానమిచ్చారు. నాసాలో దాదాపు మూడు దశాబ్దాలు పనిచేసిన సునీతా విలియమ్స్.. గతేడాది డిసెంబర్ 27న పదవీ విరమణ చేశారు. ఈ క్రమంలో మూడుసార్లు అంతరిక్షయానం చేసిన ఆమె.. 608 రోజులు ఐఎస్ఎస్‌లో ఉండి సుదీర్ఘ కాలం అంతరిక్షయానం చేసిన వ్యోమగాముల జాబితాలో చేరారు. ప్రస్తుతం భారత్ పర్యటనలో ఉన్నారు.

## సాంస్కృతిక వారసత్వ ప్రదేశాల్లో యూపీఐ సేవలు


దిల్లీ: దేశంలోని అన్ని సాంస్కృతిక వారసత్వ ప్రదేశాల్లో యూపీఐ సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఇందుకోసం భారత పురావస్తు సర్వే సంస్థ (ఏఎస్ఐ)తో నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) అనుబంధ సంస్థ ఎన్‌బీఎస్ఎల్ చర్చలు జరుపుతోంది. అన్ని హెరిటేజ్ సైట్లలోని టికెట్ కౌంటర్ల వద్ద భీమ్ యూపీఐ సేవలను త్వరలో ప్రారంభించనుంది. ప్రస్తుతం ఏఎస్ఐ పోర్టల్ ద్వారా సందర్శకులు




ఆన్‌లైన్‌లో టికెట్లు బుక్ చేసుకునే వెసులుబాటు ఉంది. ఆఫ్‌లైన్‌లో నేరుగా నగదు ద్వారానే టికెట్ల విక్రయాలు జరుగుతున్నాయి. డిజిటల్ పేమెంట్లు అనుమతించడం లేదు. ఈ నేపథ్యంలోనే ఆయా ప్రాంతాల్లో టికెట్ కౌంటర్ల వద్ద డిజిటల్ సేవలను తీసుకురానున్నట్లు ఎన్‌బీఎస్ఎల్ ఎండీ, సీఈఓ నటరాజన్ తెలిపారు. పర్యటకులకు సులభంగా ఉండేలా క్యూఆర్ కోడ్‌లనూ అమర్చుతామన్నారు. ఇలా చెల్లింపులు చేసేటప్పుడు క్యాష్‌బ్యాక్ ఇచ్చే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు పేర్కొన్నారు.

## మహారాజా ఎక్స్‌ప్రెస్‌కు త్రుటిలో తప్పిన ప్రమాదం


భారత్‌లో అత్యంత విలాసవంతమైన మహారాజా ఎక్స్‌ప్రెస్‌కు పెను ప్రమాదం తప్పింది. ఈ రైలు మంగళవారం అర్ధరాత్రి జైపూర్ నుంచి సవాయి మాధోపుర్‌కు వెళ్తుండగా.. మార్గమధ్యంలో పట్టాలపై ఉన్న ఇనుప రాడ్లను పైలట్ గుర్తించారు. వెంటనే ఎమర్జెన్సీ బ్రేక్‌లు వేసి రైలు ఆపారు. రైల్వే అధికారులకు సమాచారం అందించడంతో వారు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. దాదాపు 5 అడుగుల పొడవు ఉన్న ఇనుప రాడ్లను గుర్తించారు. వీటిని దుండగులు ఉద్దేశపూర్వకంగానే పట్టాలపై పెట్టి ఉంటారని అధికారులు అనుమానిస్తున్నారు. ఘటనాస్థలంలో జాగిలాల సాయంతో తనిఖీలు చేపట్టారు. ఈ ఘటన కారణంగా రైలు దాదాపు అరగంట పాటు నిలిచిపోయింది. దీనిపై కేసు



నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు వెల్లడించారు. ఈ రైల్లో ఎక్కువ మంది విదేశీ ప్రయాణికులు ఉన్నట్లు తెలుస్తోంది.

## అవి డీప్‌ఫేక్ వీడియోలు : రాజ్యసభ ఎంపీ సుధామూర్తి

ప్రస్తుత కృత్రిమమేధ యుగంలో సామాన్యుల నుంచి సెలబ్రిటీల వరకు చాలామంది ఎదుర్కొంటున్న అతిపెద్ద సమస్యల్లో డీప్‌ఫేక్ కూడా ఒకటి. రాజ్యసభ ఎంపీ సుధామూర్తి పెట్టుబడి స్కీమ్‌లను ప్రచారం చేస్తున్నట్లుగా ఉన్న వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. తాజాగా దీనిపై సుధామూర్తి స్పందించారు. అవి నకిలీవని, వాటిని నమ్మొద్దని పేర్కొన్నారు. ఎక్స్ వేదికగా ఆమె ఓ వీడియో విడుదల చేశారు. రూ.20వేలు పెట్టుబడి పెడితే.. పది



రెట్లు రాబడి వస్తోందంటూ తాను చెప్పినట్లుగా సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వీడియోలు నకిలీవని సుధామూర్తి పేర్కొన్నారు. ఈ డీప్‌ఫేక్ వీడియోలను చూసి ప్రజలు మోసపోవద్దని కోరారు. వీటిని నమ్మి తనకు తెలిసినవారు డబ్బులు పోగొట్టుకున్నారని వెల్లడించారు. తాను ఎప్పుడూ ఆర్థిక పెట్టుబడుల గురించి మాట్లాడనని, ఇలాంటి వీడియోలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇక, గత నెలలో కూడా సుధామూర్తి ఇలాంటి హెచ్చరికలే చేశారు. అధిక రాబడులు పొందడానికి తాను సూచించిన సంస్థల్లో పెట్టుబడులు పెట్టాలంటూ ఆమె చెబుతున్నట్లుగా ఉన్న వీడియో వైరల్ అయ్యింది. అవి ఫేక్ అని, వాటిని నమ్మొద్దని ఆమె పేర్కొన్నారు.

## ముస్లింల వివాహాల్లో రామునిడి పాటలు, సిందూరం

బిహార్‌లోని గయా, ఔరంగాబాద్ సరిహద్దులో గల పీరు, బంతారా గ్రామాలు భారతీయ సంస్కృతిలోని వైవిధ్యానికి సజీవ సాక్ష్యాలు. ఈ గ్రామాల ముస్లింలు ఇస్లాం మతాన్ని అనుసరిస్తున్నప్పటికీ, వారి ఇళ్లలో శుభకార్యాలు హిందూ పద్ధతుల్లోనే జరుగుతాయి. మసీదులో నికాహ్ జరిపాక, ఇంటి వద్ద హిందూ ఆచారాలే పాటిస్తారు. వధువు నుదుట సిందూరం అలంకరిస్తారు. పెళ్లిపందిరిలో నాగలితో భూమిని దున్నుతారు. ఈ రెండు గ్రామాల్లో సుమారు వెయ్యి ముస్లిం కుటుంబాలు ఉన్నాయి. వీరి ఇళ్లలో వివాహ వేడుకలు మొదలైతే శ్రీరాముడి కీర్తనలు వినిపిస్తాయి. హల్దీ వేడుకలో మహిళలు జానపద గీతాలను ఆలపిస్తారు. ఈ ఆచారాల వెనుక 600 ఏళ్ల చరిత్ర ఉందని



గ్రామస్థులు చెబుతారు. 14వ శతాబ్దంలోని ఫిరోజ్ షా తుగ్లక్ పాలనలో స్థానిక జమీందార్ల కుటుంబాలు ఇస్లాం మతాన్ని స్వీకరించాయి. మతం మారినా, తమ పూర్వీకుల నుంచి వస్తున్న హిందూ సంప్రదాయాలను కొనసాగించిన వీరు తాము హిందూ భూమిహార్ల వంశస్థులమని చెబుతారు.

## '26-26' ఉగ్ర కుట్ర.. నిఘా వర్గాల అలర్ట్


పాకిస్థాన్‌కు చెందిన ఉగ్రవాద సంస్థ జైషే మహ్మద్ భారత్‌లో ఉగ్రదాడులకు ప్లాన్ చేస్తున్నట్లు నిఘా వర్గాలు వెల్లడించాయి. ఇందుకు గణతంత్ర దినోత్సవాన్ని లక్ష్యంగా చేసుకున్నట్లు తెలుస్తోంది. ఆ దేశానికి చెందిన నిఘా సంస్థ ఐఎస్ఐ ఉగ్రవాదులకు సహకరిస్తున్నట్లు నిఘా వర్గాలు పేర్కొన్నాయి. దేశంలోని పలు ప్రాంతాల్లో జనవరి 26న భీకర దాడులకు పాల్పడేందుకు '2626' అనే కోడ్ నేమ్‌ను పెట్టుకున్నట్లు తెలిపాయి. గణతంత్ర వేడుకలకు అంతరాయం కలిగించాలనే ఉద్దేశంతో దాడులకు దిగవచ్చని తెలిపాయి. నిఘా వర్గాల సమాచారంతో అప్రమత్తమైన అధికారులు సరిహద్దులు సహా జమ్మూ కశ్మీర్, దిల్లీ, పంజాబ్ వంటి కీలక ప్రాంతాల్లో భద్రతా చర్యలను ముమ్మరం చేశారు. ఈ క్రమంలో పలువురు అనుమానితుల ఫొటోలతో దిల్లీ పోలీసులు వాంటెడ్ నోటీసులు జారీ చేశారు. వారిని ఎక్కడైనా గుర్తిస్తే సమాచారం ఇవ్వాల్సిందిగా ప్రజలను కోరారు. సోషల్ మీడియాలో ఉగ్రవాద




భావజాలాన్ని ప్రచారం చేస్తున్న కొందరు యువకులను అదుపులోకి తీసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. నిందితులు సామాజిక మాధ్యమాలలో విద్వేషపూరిత ప్రసంగాలు చేస్తూ.. జమ్మూ కశ్మీర్, పంజాబ్, దిల్లీ, హరియాణాలోని యువకులను ఉగ్రవాదం వైపు ప్రోత్సహిస్తున్నట్లు గుర్తించామన్నారు

## ఫిబ్రవరి 3న తెరుచుకోనున్న రాష్ట్రపతి భవన్ 'అమృత్‌ఉద్యాన్'

రాష్ట్రపతి భవన్ లోని అతి సుందరమైన 'అమృత్ ఉద్యాన్' ప్రజల సందర్శనార్థం తెరుచుకోనుంది. ఫిబ్రవరి 3 నుంచి మార్చి 31 వరకు అవకాశం కల్పించనున్నట్లు రాష్ట్రపతి భవన్ బుధవారం వెల్లడించింది. ఉద్యానవనంలో ప్రవేశానికి రాష్ట్రపతి భవన్‌కు సమీపంలో ఉండే గేట్ నంబర్ 35 ద్వారా ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు సందర్శకులకు అనుమతి ఇవ్వనున్నారు. ఉద్యానవనం నిర్వహణ నిమిత్తం అన్ని సోమవారాలు సెలవు ఉంటుంది. మార్చి 4న హోలీ సందర్భంగా సెలవు ప్రకటించారు. అమృత్ ఉద్యానవనాన్ని సందర్శించాలనుకునేవారు రాష్ట్రపతి భవన్ అధికారిక వెబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. 35వ



ప్రవేశద్వారం వద్దకు చేరుకున్నాక ఆఫ్‌లైన్ ద్వారా కూడా స్లాట్‌ను బుక్ చేసుకోవచ్చు. ప్రజల సౌకర్యార్థం సమీప మెట్రో స్టేషన్ నుంచి బస్సు సౌకర్యం కల్పించనున్నారు.

## 'సనాతన ధర్మంపై ఉదయనిధిది విద్వేష ప్రసంగమే'

తమిళనాడు ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ 2023లో సనాతన ధర్మంపై చేసిన వ్యాఖ్యలు అప్పట్లో తీవ్ర దుమారం రేపిన సంగతి తెలిసిందే. తాజాగా దీనిపై మద్రాస్ హైకోర్టు స్పందిస్తూ.. ఉదయనిధి ప్రసంగం విద్వేషపూరితంగానే ఉందని మండిపడింది. ఉదయనిధి మాటలను విమర్శిస్తూ.. భాజపా నేత అమిత్ మాలవీయ సోషల్



మీడియాలో పోస్టు పెట్టడంపై దాఖలైన కేసును హైకోర్టు కొట్టేసింది. మాలవీయ చేసిన పోస్టు నేరం కిందకు రాదని పేర్కొంది. సనాతన ధర్మాన్ని అనుసరించే వారే లక్ష్యంగా చేసిన రెచ్చగొట్టే ప్రసంగానికి అది ప్రతిస్పందన మాత్రమేనని స్పష్టం చేసింది. ఉదయనిధి ఉపయోగించిన పదజాలంపై అసహనం వ్యక్తంచేస్తూ.. అది విద్వేషపూరిత ప్రసంగం కిందకే వస్తుందని పేర్కొంది. ఈ వ్యవహారంపై తమిళనాడులో మంత్రికి వ్యతిరేకంగా ఎలాంటి కేసు నమోదు కాలేదని, ఇతర రాష్ట్రాల్లో కొన్ని కేసులు నమోదైన విషయాన్ని ప్రస్తావించింది. సెప్టెంబరు 2023లో తమిళనాడులో జరిగిన ఓ కార్యక్రమంలో ఉదయనిధి మాట్లాడుతూ.. 'సనాతన ధర్మాన్ని నిర్మూలించాలి' అని అన్నారు. ఇది సామాజిక న్యాయానికి వ్యతిరేకమని పేర్కొన్నారు. దీనిపై అప్పట్లో దేశవ్యాప్తంగా దుమారం చెలరేగింది.

## దావోస్ వేదికగా.. ఐరోపా తీరుపై మండిపడ్డ ట్రంప్

ఐరోపా దేశాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఐరోపా కూటమి సరైన దిశలో వెళ్లడం లేదని విమర్శించారు. పెద్దఎత్తున వచ్చే వలసలపై ఇక్కడ నియంత్రణ లేదన్నారు. స్విట్జర్లాండ్‌లోని దావోస్ వేదికగా జరుగుతున్న 'ప్రపంచ ఆర్థిక వేదిక' సదస్సులో పాల్గొని ప్రసంగించిన ఆయన.. తన పాలనలో అమెరికా అభివృద్ధి పథంలో అద్భుతంగా దూసుకెళ్తుందన్నారు. దేశంలో ద్రవ్యోల్బణాన్ని కట్టడి చేశామని, ప్రపంచ ఆర్థిక ఇంజిన్‌గా అమెరికా నిలుస్తోందన్నారు.

**అభివృద్ధి పథంలో అమెరికా..**

''ఈ సదస్సుకు హాజరైన ఎంతో మంది మిత్రులు, కొందరు శత్రువులకు శుభాకాంక్షలు. నన్ను




ఎన్నుకున్నందుకు అమెరికా ప్రజలు సంతోషంగా ఉన్నారు. రెండేళ్ల క్రితం మాది నిర్జీవ ఆర్థిక వ్యవస్థగా ఉండేది. ఇప్పుడు మళ్లీ సజీవంగా మారింది. ఐరోపాలో కొన్ని ప్రాంతాలకు ఇంకా గుర్తింపు లేదు. ఈ ఖండం అంటే నాకు చాలా ఇష్టం. కానీ, అది సరైన దిశలో వెళ్లడం లేదు. గతంలో జరిగిన నష్టాలను పునరుద్ధరించుకునేందుకు విదేశాలపై సుంకాలు పెంచుతున్నాం. ఇప్పటికే చాలా వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకున్నాం. అమెరికా వృద్ధిపథంలో దూసుకెళ్తోంది. ఎంతో కాలం వెనెజువెలా కూడా అద్భుతంగా ఉండేది. కానీ, సొంత విధానాలతో వాళ్లకు వాళ్లే నాశనం చేసుకున్నారు. దాడి తర్వాత మాతో డీల్ కుదుర్చుకున్నారు. విండ్‌మిల్స్‌ను తయారు చేసి ఐరోపాకు అమ్ముతున్న చైనా భారీగా లాభాలు పొందుతోంది. పక్షులకు హాని కలిగించే, ప్రకృతిని నాశనం చేసే వాటిని తెలివితక్కువ వారే కొంటారు. ఎనర్జీతో నగదు సంపాదించుకోవాలి కానీ కోల్పోకూడదు'' అని ట్రంప్ హితవు పలికారు.

## దావోస సదస్సు.. మెక్రాన్ 'సన్‌గ్లాసెస్'పై పెద్ద చర్చే..!

సామ్రాజ్య వాదం మళ్లీ పురుడుపోసుకుంటోందని.. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 'గ్రీన్‌లాండ్' హెచ్చరికలకు ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్ కౌంటర్ ఇచ్చిన సంగతి తెలిసిందే. తమ పెద్దన్న అమెరికాపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. దావోస్‌లోని ప్రపంచ ఆర్థిక సదస్సులో ఆయన చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశమయ్యాయి. దాంతో పాటు మెక్రాన్ తన సన్‌గ్లాసెస్‌తోనూ ఆకట్టుకున్నారు. కళ్లజోడు తీయకుండా ఆయన కనిపించిన తీరుపై నెట్టింట్లో పెద్ద చర్చే నడుస్తోంది. దావోస్ సదస్సు జరుగుతున్న వేదిక లోపల కూడా మెక్రాన్ సన్‌గ్లాసెస్ ఎందుకు ధరించారు..? దీనిద్వారా డొనాల్డ్ ట్రంప్‌నకు ఏదైనా సందేశం ఇస్తున్నారా..? లేకపోతే ఇదేమైనా ఫ్యాషనా..? అంటూ నెటిజన్లు వరుస పోస్టులు పెడుతున్నారు. ఈ చర్చకు మెక్రానే ఫుల్‌స్టాప్ పెట్టారు. ''ఈ కళ్లద్దాలు పెట్టుకున్నందుకు క్షమించండి. నాకు చిన్నపాటి కంటి సమస్య ఉంది'' అని వెల్లడించారు. కొన్నిరోజుల క్రితం కూడా ఆయన కన్ను ఎర్రగా వాచి కనిపించింది. అప్పుడు కూడా కొద్దిసేపు ఈ అద్దాలు ధరించారు.

# నిద్ర లేకపోయినా.. నీరసించిపోకుండా!


**నిద్ర శరీరాన్ని రీఛార్జ్ చేస్తుంది. అందుకే రాత్రంతా సుఖంగా, హాయిగా నిద్ర పడితేనే మరుసటి రోజు ఉత్సాహంగా పనులు చేసుకోగలుగుతాం. కానీ కొన్నిసార్లు రాత్రి నిద్ర పట్టకపోవచ్చు.. కొన్ని అత్యవసర పనుల వల్ల నిద్రను త్యాగం చేయాల్సి రావచ్చు. ఇలా రాత్రంతా నిద్ర లేకపోవడం వల్ల మరుసటి రోజు నీరసించిపోతుంటాం. కానీ ఇలా జరగకుండా కొన్ని చిట్కాలు ఉపకరిస్తాయంటున్నారు నిపుణులు. అవేంటో తెలుసుకుందాం రండి..**



### బ్రేక్‌ఫాస్ట్‌లో..

రోజులో మనం తీసుకొనే తొలి ఆహారం బ్రేక్‌ఫాస్ట్. ఇది రోజంతటికీ కావాల్సిన శక్తిని, ఉత్సాహాన్నీ అందిస్తుంది. ముందు రోజు రాత్రి నిద్ర లేకపోయినా.. ఆ అలసటను దూరం చేసుకునేలా పోషకాలున్న అల్పాహారం తీసుకోవాలంటున్నారు నిపుణులు. ఈ క్రమంలో ఓట్‌మీల్, పండ్లు, నట్స్, సలాడ్స్.. వంటివి తీసుకోవడం వల్ల శరీరానికి తక్షణ శక్తి వస్తుందంటున్నారు. తద్వారా మధ్యాహ్న భోజనం వరకు అలసట దరిచేరకుండా జాగ్రత్తపడచ్చు. అలాగే తీసుకునే ఆహారంలో చక్కెరలు, కెఫీన్ వంటివి లేకుండా చూసుకోవాలి.

### విరామం తీసుకోండి!



రాత్రంతా నిద్ర లేకుండా మరుసటి రోజు ఉదయాన్నే ఆఫీసుకు వెళ్లడం, ఇతర పనుల్ని పూర్తిచేయడమంటే చిరాకే! అలాగని వాటిని పక్కన పెట్టలేం. కాబట్టి ముందు రోజు నిద్రలేమి ఆయా పనులపై పడకూడదంటే.. మధ్యమధ్యలో కాసేపు విరామం తీసుకోవడం తప్పనిసరి అంటున్నారు నిపుణులు. ఈ క్రమంలో పచ్చటి మొక్కల మధ్య కాసేపు నడవడం, నచ్చిన పాట వినడం, నచ్చిన వారితో మాట్లాడడం, శ్వాస సంబంధిత వ్యాయామాలు చేయడం.. ఇలాంటి పనుల వల్ల శరీరం పునరుత్తేజితమవుతుంది. అలాగే ఏకాగ్రత పెరుగుతుంది. ఇది పనిపై తిరిగి పూర్తి దృష్టి పెట్టేందుకు దోహదం చేస్తుందంటున్నారు నిపుణులు.

### తగినన్ని నీళ్లు

నిద్రలేమి అలసటను దూరం చేసుకోవాలంటే శరీరంలో తగినంత నీటి శాతం ఉండేలా జాగ్రత్తపడడం ముఖ్యమంటున్నారు నిపుణులు. ఈ క్రమంలో రోజంతా సరిపడా నీళ్లు తీసుకోవాలని చెబుతున్నారు. నీళ్లతో పాటు పండ్ల రసాలు, హెర్బల్ టీలు, పండ్ల ముక్కలు/కాయగూర ముక్కలు/మూలికలు వేసి తయారుచేసిన ఇన్‌ఫ్యూజ్‌డ్ వాటర్.. వంటివి తీసుకోవడం వల్ల శరీరం హైడ్రేట్ అవుతుంది.. అలాగే వాటిలోని పోషకాలూ శరీరానికి అందుతాయి. ఫలితంగా తక్షణ శక్తి వస్తుంది.


### ఒత్తిడికి దూరంగా..!




ముందు రోజు రాత్రి నిద్రలేమి మరుసటి రోజు ఒత్తిడికి కారణమవుతుంటుంది. దీనివల్ల అలసట, నీరసమే కాదు.. అలర్ట్‌నెస్‌ని కూడా కోల్పోతుంటాం. ఇలా జరగకూడదంటే ఒత్తిడిని దూరం చేసుకొనే మార్గాల్ని అన్వేషించాలి. ఇందుకు ఉదయాన్నే కొద్దిసేపు యోగా, ధ్యానం.. వంటివి సాధన చేయాలి. వీటివల్ల శరీరానికి వ్యాయామం అందడమే కాదు.. నాడీ వ్యవస్థపై సానుకూల ప్రభావం పడుతుంది. తద్వారా నాడులు రిలాక్సై.. ఒత్తిడి దూరమవుతుంది. అలాగే వీలైతే మధ్యాహ్న సమయంలో 1020 నిమిషాల పాటు కునుకు తీయడం కూడా మంచిదే అంటున్నారు నిపుణులు!

# చినిగితే... ప్యాచ్ ఉందిగా!

**ఎంతో ముచ్చటపడి కొనుక్కున్న డ్రెస్ పొడవైనా, చినిగినా టైలర్ దగ్గరికి పరుగెత్తాల్సిందే! సమయముంటే సరే... లేకపోతే? అంతేనా, అది సరిగా కుదరకపోయినా, అతుకు అమరకపోయినా ఇంకో ఇబ్బంది. కొన్నిసార్లు పక్కన పడేయాల్సిందే. ఈ ఇబ్బందులన్నీ ఎందుకు? ప్యాచ్ వేయండి చాలు.**





### రంగులున్నాయ్!

కుర్చీలు, వాహనాలు... మన దుస్తులకు శత్రువులు ఒకటా రెండా. చిటికెలో రంధ్రం పడేలా చేస్తాయి. చిన్నవైతే దాచేయొచ్చు. కానీ పెద్దగా కనిపిస్తోంటే వేసుకోవడమూ కష్టమే. 'ఐరన్ ఆన్ ప్యాచ్'లు తెచ్చి ఉంచుకోండి. ఇవి అన్ని రకాల రంగుల్లో దొరుకుతాయి. తగిన రంగుది ఎంచుకుని చినిగిన ప్రదేశంలో ఉంచి, ఐరన్ చేయడమే. చక్కగా కలిసిపోతుంది. భిన్న రంగుది వేస్తే కాంట్రాస్ట్‌గానూ తోస్తుంది. కొన్ని కుట్టుకునే రకాలూ ఉన్నాయి. వాటిని తెచ్చుకున్నా సరే.

### మడత పెట్టేయొచ్చు!

ప్యాంటో టాపో పొడవైంది. అదే వేసుకుని తీరాలి. అలాగని మడిచినా పిన్నీసులు పెట్టినా కుదరదు.



కనిపించడమే కాదు... పదే పదే ఊడుతూ చిరాకు పెట్టిస్తాయి. అలాంటప్పుడు ఈ 'ఫ్యాబ్రిక్ ఫ్యూజింగ్ టేప్' ఉంటే సరి. చక్కగా వస్త్రం మీద పెట్టి మడిచేయండి. ఆపై దానిమీద ఇస్త్రీ పెట్టెతో ఐరన్ చేస్తే సరి. చక్కగా అతుక్కుంటుంది. చిన్న చినుగుల్ని వదిలేయలేము, అలాగని కుట్టనూ లేము. అలాంటప్పుడూ ఇది పనికొస్తుంది.

### అందంగా దాచేయొచ్చు

కుట్టండి లేదా ఐరన్ చేయండి... డ్రెస్‌లో ఏదో లోటు. అందంగా కనిపించట్లేదు అనిపిస్తోంది అంటారా? అయితే ఈ 'ఫ్లోరల్ ప్యాచెస్' ప్రయత్నించొచ్చు. సమస్య ఉన్న ప్రాంతంలో కుట్టొచ్చు లేదా వస్త్రం మీద ఉంచి, వెనకవైపుగా ఐరన్ అయినా చేయొచ్చు. లోపాన్ని అందంగా దాచేయొచ్చన్న మాట. సాదా దుస్తుల అందాన్ని పెంచాలన్నా వీటి సాయం తీసుకోవచ్చు. బాగున్నాయి కదూ! ఆన్‌లైన్‌లో దొరుకుతున్నాయి. కావాలంటే ప్రయత్నించండి.

# చోటు వెతకాల్సిన పని లేదిక..!



**నగరాల్లో అన్నీ కాంపాక్ట్(చిన్న) కిచెన్లే. లేదంటే మిగతా గదుల నిర్మాణం విషయంలో రాజీపడాల్సి వస్తుంది. అలాకాకూడదని అవసరం మేరకే వంటింటిని నిర్మించుకుంటున్నారు ఈ తరం. అనుకూలంగా ఉండే వస్తువులూ కావాలిగా మరి. అలాంటివే ఈ కిచెన్ ఆర్గనైజర్లు.**

మిర్చి, వెల్లుల్లి, అల్లం వంటివి గాలి తగిలే ప్రాంతాల్లో ఉంచితేనే నిల్వ ఉంటాయి. లేదంటే కొద్దిరోజుల్లోనే పాడైపోతాయి. మరి వాటిని ఒక్కొక్కటిగా ట్రేల్లో వేస్తే చూడటానికి గజిబిజిగా ఉంటాయి. ఈ 'మల్టీ టైర్ సక్షన్ కప్ వాల్ స్టోరేజ్ హోల్డర్ల'ను ఉపయోగించి చూడండి. ఎంత స్థలం కలిసొస్తుందో. వంటింటి గోడలకు ఈ హోల్డర్లను అమర్చితే సరి. డ్రిల్లింగ్ చేసి గోడలకి రంధ్రాలు చేయాలన్న భయమూ అవసరం లేదు. వీటిని సక్షన్ సాంకేతికతతో అతికించొచ్చు.



### ఒకదానిపై ఒకటి...

వంటింటి సరకుల్లో... వాడేవీ నిల్వ ఉండేవీ వేరుగా పెడితేనే పాడవకుండా ఉంటాయి. అయితే రెండింటికీ వేర్వేరు బాక్సులు, డబ్బాలు కేటాయించగలమా? మన మాడ్యులర్, మైక్రో కిచెన్లలో ఇన్ని సామాన్లకు స్థలం ఉంటుందా? అలాంటప్పుడు ఈ 'మల్టీ లేయర్ ఫుడ్ స్టోరేజ్ బాక్సులు' ఉపయోగించి చూడండి. వాడుకునే సరకుల్ని ఇందులో వేసుకుని ఒకదానిపై ఒకటి అతికిస్తే సరి. అవసరం అయినప్పుడు తీసుకుంటాం. వంట అయిపోగానే యథాస్థితిలో అమర్చి పెట్టేస్తాం. అందానికి అందం, సౌలభ్యం కూడా.






### కలిసి ఉండే జాడీలు...

స్టీలు, రాగి, సిల్వర్ ఎన్ని బాక్సులు వచ్చినా... వంటింట్లో పారదర్శక వస్తువులకే ప్రాధాన్యత ఇస్తాం. వెతుకులాట లేకుండా వస్తువు వెంటనే కనిపిస్తుందని. అయితే ఒక్కో వస్తువు ఒక్కో దగ్గర ఉన్నా విసుగే. ఈ 'మల్టీపర్పస్ స్పైస్ టవర్' ఆ సమస్యను పరిష్కరిస్తుంది. దీనిలో ఐదు నుంచి ఆరు జాడీలు ఉంటాయి. వాడుకునే సరకుల్ని ఇందులో వేస్తే సరి. ఒక్కోదానికి వేర్వేరు మూతలు ఉన్నా... అన్నింటినీ ఒకదానిపై ఒకటి అతికించొచ్చు. చూడటానికీ అందంగా ఉంటాయి. స్థలాభావాన్ని భర్తీ చేస్తాయి.

# సినిమా




## అంతా అబద్ధం

మెగాస్టార్ చిరంజీవి తాజాగా మన శంకర వరప్రసాద్‌గారుతో బ్లాక్‌బస్టర్ అందుకుని రూ.300 కోట్ల క్లబ్‌లోకి చేరిన విషయం తెలిసిందే. ఈ ఊపుతో ఆయన 158వ సినిమా దర్శకుడు బాబీ కొల్లితో తెరకెక్కనుంది. ఈ సినిమా వచ్చే నెలలో లాంఛనంగా ప్రారంభం కానుండగా.. మార్చి నుంచి చిరంజీవి రెగ్యులర్ షూటింగ్‌లో పాల్గొంటారని సమాచారం. మాస్ యాక్షన్ డ్రామాగా రూపొందనున్న ఈ చిత్రంలో కూతురు సెంటిమెంట్ కీలకమని టాక్. ఈ క్రమంలోనే ఈ సినిమాలో చిరంజీవి కుమార్తె పాత్ర కోసం 'ఉప్పెన' ఫేమ్ కృతి శెట్టిని ఎంపిక చేసినట్లు వార్తలు తెగ హల్‌చల్ చేస్తున్నాయి. యంగ్ అండ్ టాలెంటెడ్ హీరోయిన్ కావడంతో ఆమె పేరు బయటకు రావడం అభిమానుల్లో మరింత ఆసక్తిని రేకెత్తించింది. అయితే ఈ ప్రచారంపై చిత్ర యూనిట్ వెంటనే స్పందించింది. కృతి శెట్టి చిరంజీవి కూతురు పాత్రలో నటిస్తోందన్న వార్తల్లో ఎలాంటి నిజం లేదని, అవన్నీ పూర్తిగా అవాస్తవమని స్పష్టం చేసింది. అధికారికంగా తాము సమాచారం ఇచ్చేంత వరకు ఇలాంటి ఊహాగానాలను నమ్మొద్దని మేకర్స్ క్లారిటీ ఇచ్చారు.

## అవన్నీ పట్టించుకోను



ఇప్పుడు సోషల్ మీడియాలో మారుమోగుతున్న పేరు సారా అర్జున్. మొన్నటి వరకు చైల్డ్ ఆర్టిస్టుగా మెప్పించిన ఈ అమ్మడు.. ఇప్పుడు హీరోయిన్ గా అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ధురంధర్ లో కథానాయికగా తొలి చిత్రంతోనే బ్లాక్ బస్టర్ హిట్ అందుకుంది. ఇప్పుడు 'యుఫోరియా'తో తెలుగు తెరకు పరిచయం కాబోతుంది. ప్రముఖ దర్శకుడు గుణశేఖర్ ఈ మూవీకి దర్శకత్వం వహిస్తున్నారు. కాగా.. ఇటీవల సంచలనం సృష్టించిన చిత్రం 'ధురంధర్'. ఇందులో ప్రధాన పాత్రలో నటించిన రణ్‌వీర్ సింగ్, సారా అర్జున్ మధ్య 20 ఏండ్ల వయసు తేడా ఉండడంతో ఈ సినిమా టీజర్ వచ్చినప్పటినుంచే విమర్శలు మొదలయ్యాయి. తాజాగా దీనిపై సారా అర్జున్ ఓ ఇంటర్వ్యూలో స్పందించింది. 'నేను సోషల్ మీడియాల్లో పెద్దగా యాక్టివ్‌గా ఉండను. అందుకే అవి నా వరకు రాలేదు. అయినా అలాంటి విమర్శలు నేను పట్టించుకోను. ఒక విషయంపై ఎవరి అభిప్రాయాలు వారికి ఉంటాయి. 'మనం ప్రశాంతంగా ఉందాం.. పక్కవారిని ప్రశాంతంగా ఉండనిద్దాం' అనే సిద్ధాంతాన్ని నేను నమ్ముతాను. పాటిస్తాను. నాకు 'ధురంధర్' స్టోరీ నచ్చింది. దానికి నేను న్యాయం చేస్తానని అనిపించింది. అందుకే ఓకే చేశా. వినోదం కోసం ఇతర మార్గాలు ఎంచుకుంటా. బ్రేక్ టైంలో ట్రిప్‌లకు వెళ్తుంటా. నేను ఒకేచోట ఎక్కువ రోజులు ఉండలేను' అంటూ సారా చెప్పుకొచ్చింది.

## నన్ను తొక్కేసేందుకు భారీ కుట్ర

సినీ ఇండస్ట్రీలో తన అందం, నటనతో గుర్తింపు తెచ్చుకున్న బ్యూటీ నిధి అగర్వాల్.. ప్రస్తుతం టాలీవుడ్‌లో మోస్ట్ టాక్డ్ హీరోయిన్‌గా మారింది. గతేడాది పవర్ స్టార్ పవన్ కల్యాణ్‌తో 'హరిహర వీరమల్లు', ఈ సంక్రాంతికి ప్రభాస్ సరసన 'ది రాజా సాబ్' సినిమాలతో ఫుల్‌క్రేజ్ సంపాదించుకుంది. అయితే తాజాగా తన వ్యక్తిగత జీవితం, సినీ కెరీర్‌కు సంబంధించి ఆసక్తికర విషయాలను ప్రేక్షకులతో పంచుకుంది. ఈ స్థాయికి చేరుకోవడం వెనుక ఎన్నో చేదు అనుభవాలు ఉన్నాయని గుర్తుచేసుకుంటూ ఎమోషనల్ అయ్యింది. 'నాపై ఇండస్ట్రీలో కొందరు పనిగట్టుకుని నెగిటివ్ క్యాంపెయిన్ చేస్తున్నరు. నన్ను తొక్కేయడానికి భారీగా డబ్బులు ఖర్చు చేసి మరీ కుట్రలు చేస్తున్నరు. నటీనటులు చాలా సెన్సిటివ్, ఎమోషనల్, చిన్నపిల్లల మనస్తత్వంతో ఉంటారు. ఇలాంటివి జరిగితే వారి కుటుంబాలు కూడా ఎంతో బాధపడతాయి. మేం సమాధానం చెప్పాల్సింది మా తల్లిదండ్రులకు మాత్రమే. ఇలాంటి నెగిటివ్ క్యాంపెయిన్‌లు మంచిది కాదు. కాశీకి వెళ్లి వచ్చిన తర్వాత ఆధ్యాత్మికంగా నాలో చాలా మార్పు వచ్చింది. ఇప్పుడు ఇలాంటి ఎన్ని తప్పుడు ప్రచారాలు ఎదురైనా ధైర్యంగా నిలబడతా' అంటూ చెప్పుకొచ్చింది. ప్రస్తుతం నిధి చేసిన ఈ కామెంట్స్ సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారాయి.






## ఆషికా రంగనాథ్ : సూర్యాస్తమయ ప్రశాంతతలో సున్నితమైన మెరుపు

ఈ మనోహరమైన ఫోటోలో, ఆషికా సున్నితమైన అలంకరణలతో కూడిన ఎర్రటి స్ట్రాప్ డ్రెస్‌లో, కలల వంటి సూర్యాస్తమయ ఆకాశం నేపథ్యంలో హుందాగా పోజు ఇచ్చింది. ఆమె అలల జుట్టు, సున్నితమైన మేకప్, ముఖం దగ్గర సున్నితమైన చేతి భంగిమ మరియు వెచ్చని చిరునవ్వు దివ్యమైన ఆకర్షణను మరియు స్త్రీత్వాన్ని వెదజల్లుతున్నాయి.

## రియల్ ఎస్టేట్ ఏజెంట్‌గా 'అందరివాడు' నటి..



2000ల్లో వరుస సినిమాలతో అలరించారు నటి రిమీ సేన్. బాలీవుడ్, టాలీవుడ్‌ల్లో అగ్ర హీరోలతో నటించిన ఆమె ప్రస్తుతం దుబాయ్‌లో రియల్ ఎస్టేట్ ఏజెంట్‌గా వ్యాపారం చేస్తున్నారు. సినిమా అవకాశాలు తగ్గడంతో ఆ వ్యాపారంలోకి వెళ్లి తన కెరీర్‌ను మార్చుకున్నారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో రిమీ ఈ మాట చెప్పడంతో ఒక్కసారిగా ఆమె పేరు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ''దుబాయ్ నన్ను ప్రేమతో స్వాగతించింది. ఇక్కడి జనాభాలో 95 శాతం మంది ప్రవాసులే ఉన్నారు. దుబాయ్ ప్రజలు అందరి గురించి ఆలోచిస్తారు. సౌకర్యవంతమైన జీవితాన్ని గడపొచ్చు. భారత్‌తో పోలిస్తే.. దుబాయ్‌లో వ్యాపార అవకాశాలు సులభంగా లభిస్తాయి. ఇక్కడ రియల్ ఎస్టేట్ మార్కెట్ కూడా సజావుగా పనిచేస్తుంది

## 'ధురంధర్' 20 ఏళ్ల ఏజ్ గ్యాప్.. ఆ విమర్శలు పట్టించుకోను: సారా అర్జున్


ఇటీవల సంచలనం సృష్టించిన చిత్రం 'ధురంధర్'. ఈ సినిమా విజయం ఎంతటి హాట్ టాపిక్‌గా మారిందో.. ఇందులో ప్రధాన పాత్రలో నటించిన నటీనటుల మధ్య వయసు వ్యత్యాసం కూడా అంతే వైరల్ అయ్యింది. రణ్‌వీర్ సింగ్, సారా అర్జున్ మధ్య 20 ఏళ్ల వయసు తేడా ఉండడంతో ఈ సినిమా టీజర్ వచ్చినప్పటినుంచే విమర్శలు మొదలయ్యాయి. తాజాగా దీనిపై సారా అర్జున్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. తాను ఇలాంటి విషయాలు పట్టించుకోను అని అన్నారు. ''ఇవన్నీ సోషల్ మీడియాలో వచ్చిన విమర్శలే కదా.. నేను సామాజిక మాధ్యమాల్లో పెద్దగా యాక్టివ్‌గా ఉండను. అందుకే అవి నా వరకు రాలేదు. అయినా.. ఒక విషయంపై ఎవరి అభిప్రాయాలు వారికి ఉంటాయి. 'మనం ప్రశాంతంగా ఉందాం.. పక్కవారిని ప్రశాంతంగా ఉండనిద్దాం' అనే సిద్ధాంతాన్ని నేను నమ్ముతాను. పాటిస్తాను. నాకు 'ధురంధర్' కథ నచ్చింది. ఆ కథకు నేను న్యాయం చేస్తానని అనిపించింది. అందుకే ఓకే చేశా. బహుశా దీనిగురించి టీజర్ వచ్చినప్పుడే మాట్లాడుకున్నారు.

## భగవంత్ కేసరి' ఇంకా హిట్ కావాల్సింది.. కానీ

**: అనిల్ రావిపూడి**

ప్రస్తుతం దర్శకుడు అనిల్ రావిపూడి 'మన శంకర వరప్రసాద్ గారు' విజయాన్ని ఎంజాయ్ చేస్తున్నారు. ఈ సంక్రాంతికి వచ్చిన ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ రోజుకో కొత్త రికార్డును తన ఖాతాలో వేసుకుంటోంది. ఈ సినిమా ప్రచారంలో భాగంగా ఇటీవల ఓ ఇంటర్వ్యూలో అనిల్ గతంలో తాను దర్శకత్వం వహించిన 'భగవంత్ కేసరి' గురించి మాట్లాడారు. అది ఇంకా పెద్ద విజయం సాధించాల్సిన చిత్రమని అభిప్రాయపడ్డారు. ''బాలకృష్ణతో నేను ఎవరూ ఊహించనివిధంగా సినిమా చేయాలనుకున్నాను. నా కెరీర్‌లో కష్టపడి రాసుకున్న స్క్రిప్టులలో అదీ ఒకటి. కానీ, ఆ సినిమా ఇంకా హిట్ కావాల్సింది. అది విడుదలైనప్పుడు చంద్రబాబునాయుడు జైలులో ఉండడంతో బాలయ్య అభిమానులు చాలామంది నిరాశకు గురయ్యారు. సాధారణ ప్రేక్షకులు దాన్ని చూసి ఆదరించి హిట్ చేశారు. పరిస్థితులు బాగుండి ఉంటే దానికి ఇంకా ఆదరణ దక్కేది'' అని అనిల్ రావిపూడి అన్నారు. అయితే, విజయ్ హీరోగా రానున్న 'జన నాయగన్' స్క్రిప్ట్ విషయంలో తాను సాయం చేశాక ఆ నిరాశ నుంచి కొంత బయటకు వచ్చినట్లు చెప్పారు. బాలకృష్ణ హీరోగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో 'భగవంత్ కేసరి' తెరకెక్కింది. 2023 అక్టోబర్ 19న విడుదలైన ఈ సినిమా ఆదరణ సొంతం చేసుకుంది. ఈ సినిమా 71వ జాతీయ చలన చిత్ర అవార్డుల్లో ఉత్తమ చిత్రంగా అవార్డును సొంతం చేసుకుంది.





Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.